Regd.No. TRP / 123 / 2018 - 20 July 2018 Rs.10/- R.No.8139/63

Date of Publication 26-06-2018, Permitted to post : 29th, 30th every month.

త్రినేత్ర వైద్యాలయము
భక్తకన్నప్ప కంటి ఆసుపత్రి.

శ్రీశుకబ్రహ్మాశ్రమము, స్వామి ప్రకాశానందనగర్, శ్రీకాళహస్తి, ఆం.ప్ర.

ఇందు నిరుపేదలకు ఉచితంగా కంటి చికిత్సలు చేయబడును. కంటిపొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడును. ఆపరేషన్ చేసిన వారికి ఉచితంగా భోజనాలు పెట్టబడును. ఉచితంగా మందులు మరియు 40 వ రోజు కళ్లద్దాలు ఇవ్వబడును. దీనికి విరాళమిచ్చువారికి 80 జి సెక్షన్ క్రింద ఆదాయపు పన్ను మినహాయింపు కలదు.

ఈ ఆసుపత్రి పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిచే స్థాపించబడినది.

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం

వేదాంతభేరి

జూలై 2018 రూ. 10/-



సద్గురు మహర్షి మలయాళస్వాములవారు

ఆంధ్ర తెలంగాణా దేశోద్ధారకులు

వేదాంతభేరి

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము: 51 జూలై 2018 సంచిక: 07

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : **శ్రీ శుకబ్రహ్మాశ్రమము,**
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్: 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి-శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు- 06
03. సద్గురు బోధ - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 09
04. రాజయోగం - ఆరు పాఠాలు - శ్రీస్వామి వివేకానంద - 12
05. జ్ఞానం వినా మోక్షో న సిద్ధ్యతి -
శ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు - 19
06. శ్రీ మలయాళస్వామి జీవిత విశేషాలు జీవకారుణ్యం
- డా॥సముద్రాల లక్ష్మణయ్య - 23
07. మన క్షేత్రాలు - భూకైలాసం గోకర్ణం - నైనారు అప్పాస్వామి - 25
08. ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే -
- శ్రీమాతా కృష్ణానందగిరి స్వామినివారు - 26
09. సువర్ణ సోపానములు - పాణ్యం రామనాథ శాస్త్రి - 31
10. ధర్మ ప్రచారకులు సద్గురు మహర్షి శ్రీ మలయాళస్వాములవారు
- శ్రీమతి బొప్పన అరుణాదేవి - 34
11. జాతస్య హి ధ్రువో మృత్యుః - ఆచార్య కె.సర్వోత్తమరావు - 41
12. వార్తలు - 42

ముఖచిత్రం ఆంధ్రదేశోద్ధారకులు

సద్గురు శ్రీ మహర్షి మలయాళస్వాములవారు.

జూలై 23వ తేది తొలైకాదశి శ్రీ సద్గురు మలయాళస్వాములవారి ఆరాధన. జూలై 28వ తేది గురుపూర్ణిమ.

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

1. ఓం బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాది లక్ష్యమ్ ।
ఏకం నిత్యం విమలమచలం సర్వధీసాక్షిభూతం
భావాతీతం త్రిగుణరహితం సద్గురం తం నమామి ॥

2. అఖండమండలాకారం వ్యాప్తం యేన చరాచరమ్ ।
తత్పదం దర్శితం యేన తస్మై శ్రీ గురవే నమః ॥

3. అజ్ఞానతిమిరాంధస్య జ్ఞానాంజనశలాకయా ।
చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురవే నమః ॥

4. సచ్చిదానందరూపాయ వ్యాపినే పరమాత్మనే ।
నమో వేదాన్తవేద్యాయ గురవే బుద్ధిసాక్షిణే ॥

5. యోగీన్ద్ర హృదయామ్భోజ నిషణ్ణమపవర్గదమ్ ।
నమామి దక్షిణామూర్తిం ప్రణవాత్మ స్వరూపిణమ్ ॥

ఓం నైష్ఠికబ్రహ్మచర్యేణ తపసా శివతోషణాత్ ।
యస్సిద్ధస్సాధనే సోఽయం శ్రీ గురుశ్శరణం మమ ॥

ఓం శ్రేష్ఠే గోగర్భతీర్థే ఽ స్మిన్ వత్సరే ద్వాదశాత్మకమ్ ।
కృతం యేన తపస్సో ఽ యం శ్రీ గురుశ్శరణం మమ ॥

ఓం త్యక్త్వావాచాహి వేదాన్తం ధృత్వానుష్ఠానకం తు తత్ ।
తీర్ణో భవాంబుధేర్యోఽసౌ శ్రీ గురుశ్శరణం మమ ॥

ఓం స్త్రీశూద్రద్విజబన్ధూనాం త్రాతా సంసార వారిధేః ।
భక్త్యాది బోధనాద్యోఽసౌ శ్రీ గురుశ్శరణం మమ ॥

ఓం కరుణానిధినా యేన మలయాళమహర్షిణా ।
ఆంధ్రస్సముద్ధృతస్సోఽయం శ్రీ గురుశ్శరణం మమ ॥

ఓం విద్యయా తపసా మర్త్యః పూతాత్మా భవతి ధ్రువమ్ ।
ఇతి శ్రౌతోపదేష్టాయ శ్రీ గురుశ్శరణం మమ ॥

\- శ్రీవిద్యానందగిరిస్వాములవారు

(23-7-2018 శ్రీ మలయాళస్వాములవారి ఆరాధన సందర్భంగా)

బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి

\- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ఉపనిషత్తులందు ఒక చక్కని ఉపమానము చెప్పబడి యున్నది.

ఒకానొక చెట్టు కలదు. ఆ చెట్టుయొక్క చిటారు కొమ్మపై ఒక పక్షి కూర్చుండి ప్రశాంత చిత్తముతో దిక్కులను వీక్షించుచు గంభీర భావముతో వర్తించుచుండెను. ఇంకొక పక్షి ఆ చెట్టు మధ్యభాగమున ఇటునటు తిరుగుచు చంచల స్వభావముగల్గి, ఒక్కొక్కసారి మధుర ఫలమును తిని సంతోషించుచు, మఱియు ఒక్కొక్కసారి కటుఫలము భక్షించి ఏడ్చుచు, ఈ ప్రకారముగ సుఖదుఃఖములచే నానా యాతనల నొందుచు నుండెను. ఇట్లుండ కొంతసేపటికి క్రిందనున్న పక్షి పైన హాయిగ కూర్చొనియున్న పక్షిని పరికించి, నెమ్మది నెమ్మదిగ పైకి యెగిరి దాని చెంతకు చేరగనే క్రమముగ దానిలో విలయమైపోయెను. అపుడిక రెండు పక్షులు లేవు. పైపక్షి ఒకటియే శేషించియుండెను.

ద్వా సుపర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే
తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి
అనశ్న న్నన్యో ఽ భిచాకశీతి **(ముండక - ఉ. 8-1)**

ఉపనిషత్తులందు కావింపబడిన చక్కటి చిత్రణమిది. ఈ జగద్రూప వృక్షమున పరమాత్మ, జీవుడు అను రెండు పక్షులు కలవు. ఆత్మరూపపక్షి నిశ్చలమై నిర్వికారమై సుఖదుఃఖాది ద్వంద్వ వర్జితమై, గంభీరముగ వెలయుచున్నది. జీవుడనుపక్షి చంచలమై అనిశ్చిత

భావము గల్గి సుఖదుఃఖములను ద్వంద్వములను అనుభవించుచు విషయానందము పొందినపుడు ఉబ్బిపోవుచు, దుఃఖము సంప్రాప్తమైనపుడు కృంగి కృశించుచు ఈ ప్రకారముగ చిత్తచాంచల్యము ననుభవించుచు, ఎట్టకేలకు పరమాత్మయను పైపక్షినిగూర్చి తెలిసికొని, క్రమక్రమముగ సాధనాతిశయముచే ఆ పక్షి సమీపమున కేగుచున్నది. ఏగుటయే తడవుగా, అగ్నిలో పడిన మిడుత అగ్నిభావమునే పొందునట్లును, సముద్రమును జేరిన నది సముద్ర రూపమునే జెందునట్లును జీవుడు పరమాత్మ రూపమునే పడయుచున్నాడు. అదియే జీవబ్రహ్మైక్యము. అపుడు జీవుడు, శివుడు అను రెండు రూపము లుండవు. జీవుడు శివుడే యగుచున్నాడు. మానవుడు మాధవుడుగా పరిణతి జెందుచున్నాడు. నరుడిక నరుడుగా నుండక నారాయణరూపుడై భాసించుచున్నాడు. ఇదియే జీవుని చరమస్థితి. జీవుని అంతిమ లక్ష్య మిదియే.

జీవుడు విషయసుఖములకై ప్రాకులాడుచు తనకున్న అమూల్య సమయమును ధారబోయక చక్కని ఆధ్యాత్మిక సేవ గావించుచు అభ్యాసయోగమును జేబట్టి భక్తి జ్ఞాన వైరాగ్యములను లెస్సగ సాధించుట ద్వారా ఆత్మసాక్షాత్కారమును ఈ జన్మయందే సాధించవలెను. క్రిందనున్న పక్షివలె దుఃఖమునందు కాలము గడుపరాదు. జీవుడీ లోకమునకు ఏతెంచినది శోకించుటకు కాదని ముమ్మాటికి జ్ఞప్తియందుంచుకొనవలెను. ఏడ్పును పోగొట్టుకొను ఉపాయమును పెద్దలవలన తెలిసికొని దుఃఖమునకు శాశ్వతముగ తిలాంజలి నొసంగుటకే మానవ జన్మ ఏర్పడినదని నిశ్చయించు కొనవలెను. పై పక్షివలె గంభీరభావమును అలవఱచుకొనవలెను. తాను ఏకాలమందును పరిచ్ఛిన్నుడు కాదనియు, దేహరూపబంధము మధ్యలో వచ్చి మధ్యలో పోవునదే యనియు, తాను ఉపాధిరహితుడైన సచ్చిదానంద స్వరూపుడనియు పరిపూర్ణముగ నిశ్చయించవలెను.

చిదానందరూపశ్శివోఽహం. శివోఽహం- అని నిరంతరము ఎలుగెత్తి చాటుచు అట్టి బ్రహ్మానందాత్మానుభూతియందే కాలము గడుపు చుండవలెను. చక్కటి ఆధ్యాత్మిక పరిశ్రమచేతను, అకుంఠిత భక్తిశ్రద్ధల చేతను అట్టి అలౌకిక స్థితిని జీవుడు తప్పక చేరుకొనగలడు. కావున ముముక్షువగువాడు తాను పంచభూతాత్మకమై, జడమైనట్టి ఒక చిన్న అస్థిపంజరము కాదనియు, బంకమట్టితో చేయబడిన ఈ దేహమను ఇల్లు తాను కాదనియు, విశ్వవ్యాపకమై, జననమరణరహితమై, చిన్మయ స్వరూపమైనట్టి ఆత్మయే తాననియు అహర్నిశము భావించు చుండవలెను.

'తద్బ్రహ్మ నిష్కళమహం న చ భూతసంఘః-'నిష్కళమగు ఆ బ్రహ్మమునే నేనుగాని పంచభూతాత్మక జడసముదాయమగు ఈ దేహమును గాను 'అను శ్రీ శంకరాచార్యుల వాక్యమును సదా స్మృతిపథమున నుంచుకొనవలెను.

మహోన్నతమగు ఈ మానవ జీవితమును సార్థక మొనర్చుకొన దలంచువారు, ఈ జీవితమందే మోక్ష సామ్రాజ్యాభిషిక్తులు కాదలంచువారు, మఱల గర్భనరకమందు పడి నానాయాతన లనుభవించకుండ తప్పించుకొన దలంచువారు పైన దెల్పిన ఉపనిష ద్వాక్యములను నిరంతరము సంస్మరించుచు గంభీరాత్మభావమును అలవఱచుకొనుచు అభ్యాస ప్రాబల్యముచే, సాధనాతిశయముచే బ్రహ్మ సాక్షాత్కార మొంది జీవన్ముక్తులై పఱగవలయును.

'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి – 'బ్రహ్మమును తెలిసి కొనువాడు బ్రహ్మమే యగును ' అను వాక్యమును సదా జ్ఞప్తియందుంచుకొని బ్రహ్మజ్ఞాన సముపార్జన ద్వారా సాక్షాత్ బ్రహ్మరూపులే అయి జనులు తమ జీవితములను సార్థక మొనర్చుకొనవలెను. అట్టి బ్రాహ్మీస్థితియందు, ఆత్మస్థితియందు నిలుకడ కలిగియుండుటయే మోక్షము.

సద్గురు బోధ

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

బ్రహ్మనిష్ఠజేయు వారెంతవఱకు సత్య-ధర్మ-నిష్ఠ గలిగి యుందురో అంతవఱకే వారి వాక్యములకు విలువయుండును. అంత వఱకే వారి వాక్యములు ఫలించును. గాన సత్య నిష్ఠాపరులు కండు.

* * * * * * *

సంఘములోని ప్రధానవ్యక్తులు సరియైన ఆచరణ, అనుష్ఠానము గల్గియున్ననే తదితరులున్ను ఆచరించి ఆ సంఘ మభివృద్ధికి రాగల్గును. వేరుకు పురుగుపట్టిన వృక్షములు వృద్ధికిరాక, ఫలము నివ్వక నశించునట్లు అనుష్ఠాన రహితులగువారి సంఘములున్ను, సమాజములున్ను ఉచ్ఛదశకు పోక పతన మొందుచుండును. ఇదే ముఖ్యముగ గురుసాంప్రదాయము గలవారు తెలిసికొనవలసిన విషయము.

* * * * * * *

తస్మాత్ జాగ్రత ! జాగ్రత !

ఇంటిలో దీప మున్నంతవఱకు దొంగలు లోన ప్రవేశింపరు. దీపం ఆరినవెంటనే ప్రవేశింతురు. అటులనే మీ హృదయసౌధమున విజ్ఞానజ్యోతి యున్నంతవఱకు అరిషడ్వర్గములను దొంగలు లోన ప్రవేశింపరు. గావున ముముక్షువులు దీని నెఱింగి జాగరూకతతో నుండవలయును.

* * * * * * *

శ్రవణ మాత్రముచే తృప్తినొంది, బాగుగా మననము, దీర్ఘముగా నిదిధ్యాసనమున్ను చేయనందువలననే మాయ మాయమైపోక యుండుటకు కారణము.

* * * * * * *

కొందరు కొంతకాలము ఈశ్వరోపాసన, ధ్యానము చేసి మనస్సు కొంచెము నిశ్చలము కాగా, ఇక పరిపూర్ణుల మైతిమి, ధన్యత్వము నందితిమి, చేయవలసిన దేమియు లేదని తలంచి బోధలు చేయ మొదలిడుదురు. క్రమముగ వారి దృష్టి బహిర్ముఖము కాగా ధ్యానమును విస్మరింతురు. అపుడు బాహ్యావృత్తు లధికమై అంతర్లక్ష్యమందు దృష్టి సన్నగిలి తుదకు పతనమునే బొందుదురు. కావున యెట్టి బోధకులైనను నిత్యము తనలో నుండు దోషములను విమర్శించుకొని, వాటినేమాత్రము తనయందు లేకుండ చేసికొనవలయును.

గ్యాసులైటునందు కొంచెముగానే గాలికొట్టినచో అది ఆ గాలి యున్నంతవఱకు వెలిగి పిదప ఆరిపోవును. అట్లే మానవుడు కొంత ధ్యానానుష్ఠానముల సలిపి నేను ధన్యుడనైతినను అహంభావముగల్గి అనుష్ఠానమును మఱచుటచే అంతకంతకు వైరాగ్యము తగ్గి విషయలోలుడై భ్రష్టుడగును. కావున నీ ధర్మముల తెలిసికొని ధ్యానానుష్ఠానముల హెచ్చించి ధన్యత నొందవలయును.

* * * * * * *

మేఘజలము ఎంత స్వచ్ఛమైనను చవిటినేలపైబడిన యోగ్యము గాక అనారోగ్యమున కెట్లు హేతువగునో అట్లే అతి స్వచ్ఛమైన వేదాంత బోధయైనను రాగద్వేషాది కలుషిత హృదయములలోబడి చెడిపోయి విపరీత ఫలము నొసంగుచున్నది.

* * * * * * *

తనకు లేని ప్రభావమునుగూర్చి చెప్పుకొన్నచో తనకు రానున్న ప్రభావముకూడ రానేరదు. కావున ప్రారంభావస్థయందే నిస్త్రైగుణ్య పథమునందు చరించి అవధూతలతో తమను బోల్చుకొనక కాలనియమాదుల ననుసరించి వర్తించుచు క్రమానువర్తియై తుదకు శ్రేయమును పొందుటయే మేలు.

* * * * * * *

దీపమును వెలిగించునపుడు ప్రమిదెలోని చమురులో నీరు పడిన ఆ దీపము వెలుగజాలనట్లు, హృదయమందు విషయవాసనాదు లణు మాత్రమైన యున్నచో జ్ఞానజ్యోతి ప్రకాశింపదు.

* * * * * * *

వైరాగ్యబోధోపరతులచే పరిపక్వము జెందని హృదయములో చేసెడి ఆత్మవిచారణ చక్కగ కాలని కుండలో పోసిన జలమువలె నుండును.

నిప్పుపుల్లలో నిప్పు నిండుగా నుండినను అది నీటిలో తడసినచో మండనట్లు హృదయమునందు భగవత్కళ నిండియుండినను వాసనాత్రయముండువఱకు జీవునకు జ్ఞానాభివృద్ధి గానేరదు (జ్ఞానాగ్ని వెలుగదు). ఆత్మదర్శనము గలుగదు.

* * * * * * *

విషసంపర్కము గలిగినవాని కేలాగున క్రమక్రమముగా స్మృతి తప్పిపోవునో అదేరీతిగా విషయసంసర్గము గలవారికి స్వబోధ నశించును.

* * * * * * *

వస్త్రములలోని మాలిన్యమును తొలగించక రంగు అద్దినచో అది గుడ్డను

నీళ్ళలో తడపిన వెంటనే వదలిపోవును. అట్లే నిర్విషయ స్థితిని పొందనివారి బ్రహ్మవిచారము రూఢిగ సుస్థిరముగ నుండజాలదు.

* * * * * * *

ప్రకృతిజయము గలుగనంతవఱకు తక్కిన ఎన్నిమహిమలను, సిద్ధులను సంపాదించినను పూర్ణశోకశాంతియు, నిత్యమగు ఆత్మసుఖమున్ను గలుగజాలదు.

* * * * * * *

కోపముగలవారి జీవితములోగల అనుష్ఠానములన్నియు కళాయిలేని పాత్రలో వండిన పప్పుపులుసుకన్న ఎక్కువ నిరుపయోగమైనవని మరువకుడు.

ఓం

భాగవత సదస్సులు

శ్రీ శుకబ్రహ్మాశ్రమములో ప్రతినెల భాగవతంలోని ఒక్కొక్క ఘట్టంపై ఒక వారం రోజులు ఈ క్రింది తేదీలలో ఒక్కొక్క మహాత్ముని ప్రవచనం ఏర్పాటు చేయబడినది. నెలకొక మారు ఈ సదస్సు జరుగును.

1. 27-7-2018 శుక్రవారం నుండి 2-8-2018 వరకు ప్రథమ సదస్సు
2. 20-8-18 సోమవారం నుండి 26-8-18 వరకు ద్వితీయ సదస్సు
3. 18-9-18 మంగళవారం నుండి 24-9-18 వరకు తృతీయ సదస్సు
4. 20-10-18 శనివారం నుండి 26-10-18 వరకు చతుర్థ సదస్సు
5. 26-11-18 బుధవారం నుండి 2-12-18 వరకు పంచమ సదస్సు
6. 16-12-18 ఆదివారం నుండి 22-12-18 వరకు షష్ఠమ సదస్సు
7. 16-1-2019 నుండి 22.1.2019 వరకు సప్తమ సదస్సు
8. 23-1-2019 బుధవారం నుండి 29.1.2019 వరకు అష్టమ సదస్సు
9. 13.2.19 బుధవారం నుండి 19.2.2019 వరకు నవమ సదస్సు
10. 15.3.2019 శుక్రవారం నుండి 21.3.2019 వరకు దశమ సదస్సు

ఈ భాగవత సదస్సులలో పాల్గొని శ్రవణం చేయదలంచిన భక్తులకు ఉచిత నివాస భోజనాది సౌకర్యములు ఏర్పాటు చేయబడును. పాల్గొనదలంచినవారు ఒకనెల ముందుగా తమపేర్లను ఆశ్రమానికి తెలిపి ఏర్పాట్లు చేసుకోవలయును.

ఇట్లు - ఆశ్రమ పరిపాలనా సంఘము

రాజయోగం - ఆరు పాఠాలు

- శ్రీ స్వామి వివేకానంద

లోకంలో ఇతర శాస్త్రాల మాదిరే, రాజయోగం కూడా ఒక శాస్త్రమే. దీని విషయం మనసు. దాన్ని శాస్త్రం విశ్లేషించి చెబుతుంది. ఇంద్రియాతీత విషయాలను వివేకించటం ద్వారా ఇది ఆధ్యాత్మిక సౌధాన్ని నిర్మాణం చేస్తుంది. ప్రపంచంలో గొప్ప ఆధ్యాత్మిక సంపత్తిగల మహానుభావులంతా – క్రీస్తు, పాల్, పీటర్, ఎవరైనా, అంతా అపరోక్షానుభూతిని పొందినవారే. తాము దర్శించి తెలుసుకున్న ఆధ్యాత్మిక సత్యాన్ని చెప్పినవారే.

ఈ అపరోక్షజ్ఞానం యోగసాధ్యం.

జ్ఞప్తికాని, బుద్ధికాని సత్‌పదార్థానికి అవధులు కావు. బుద్ధిని దాటిన ఒకస్థితి ఉంది. ఈ స్థితి, అసలు స్పృహ లేకుండా కొయ్యబారుస్థితి రెండూ ఒకేవిధంగా ఉంటాయి. కాని రెంటిమధ్య చాలా భేదముంది. ఒకటి జ్ఞానదశ, రెండవది అజ్ఞానదశ.

ఈ యోగాన్ని ఒక శాస్త్రంగా – సహేతుకంగా తెలియచేస్తాను.

సమాధి జ్ఞానానికంతా మూలం. యోగం పంచభూతాలను వశం చేసుకునే పద్ధతిని తెలుపుతుంది. 'యోగం' అనే పదానికి కలయిక – జీవాత్మను పరమాత్మతతో కలుపుట అని అర్థం.

చైతన్యం ద్వారా మనసు పని చేస్తుంది. 'చైతన్యం' అనే ఈ పదార్థం మన స్వభావం అనే గొలుసులో ఒక కొంకి లాంటిది.

మనం అనుకునే 'నేను' అనేది కొంత ఎరుకతో కూడుకున్నదైనా, ఎక్కువ భాగం అచేతనంగానే ఉంటుంది. ఈ అహంకారానికి అజ్ఞాతంగా – అతీతంగా అతీంద్రియావస్థ ఉంది.

విశ్వాసంతో నిరంతరాభ్యాసం చేయటంవల్ల మనసులోని పొరలు మన ముందు విప్పుకుంటాయి. ప్రతిపొరలో కూడా మనకు కొన్నికొన్ని కొత్త విషయాలు అనుభవంలోకి వస్తాయి. క్రొత్తక్రొత్త ప్రపంచాలు స్పష్టమై మనకు కనిపిస్తున్నట్లు, క్రొత్తక్రొత్త శక్తులు మనకు వశమైనట్లు అనిపిస్తుంది. అయితే ఆమాత్రంతో మనం ఆగిపోరాదు. మన ముందు నిజమైన రత్నాలగని ఉన్నప్పుడు, ఈగాజురాళ్ళ తళుకులకు మనం భ్రమించరాదు.

మన లక్ష్యం పరమాత్మ దర్శనం, దాన్ని పొందాలంటే మనం మృత్యువశులం అవుతాం. సిద్ధి పొందాలనుకున్న సాధకునికి మూడులక్షణా లుండాలి.

1.ఇహాముత్రఫలభోగ విరాగం : ఇహలోకంలో, పరలోకంలో అతనికి సుఖాలు అనుభవించాలన్న కోరిక ఉండకూడదు. అతను సత్యదర్శనానికి – పరమేశ్వర దర్శనానికి మాత్రమే ప్రయత్నించాలి. మనం పుట్టింది సత్యాన్ని సాధించటానికే, భోగాలను అనుభవించటానికి కాదు. ఈ భోగానుభవాలను బుద్ధిహీనులను అనుభవించనివ్వండి. వారిలా మనం అనుభవించలేం. మనిషి ఆలోచనా స్వభావి. అందుకని మృత్యువును జయించేవరకూ, జ్యోతిర్దర్శనం కలిగేవరకూ సాధనను వదిలిపెట్టవద్దు. మనిషి నిష్ప్రయోజన వ్యర్థసంభాషణల్లోకి దిగరాదు. సంఘపూజ, కీర్తి మొదలైనవి విగ్రహారాధనల వంటివే. (కాబట్టి వాటిని ఆశించరాదు). ఆత్మకు స్త్రీ – పురుష భేదాలు, దేశకాల భేదాలు ఏమీ లేవు.

2. ముముక్షుత్వం : ముముక్షుత్వం అంటే పరమాత్మ దర్శనానికై తీవ్రకోరిక. నీటిలో మునిగినవాడు ఊపిరికోసం తహతహలాడినట్లు, సత్యానికై – పరమాత్మ దర్శనానికై మనిషి తహతహ లాడాలి. కావలసింది భగవంతుడు. మరొకటి పనికిరాదు. ప్రలోభాలను, అసత్యవిషయాలను చూసి మోసపోవద్దు. వీటి నన్నింటినీ త్యాగం చేసి ఆత్మ సాక్షాత్కారాన్నే కోరాలి.

3. శమాది షట్కసంపత్తి : ఇవి ఆరు : శమం – దమం – ఉపరతి – తితీక్ష – శ్రద్ధ – సమాధులు.

శమం : మనసును బహిర్ముఖం కానివ్వకుండా నిగ్రహించుట.

దమం : ఇంద్రియ నిగ్రహం.

ఉపరతి : మనసును లోనికి మళ్లించుట.

తితీక్ష : శీతోష్ణాది ద్వంద్వాలను సహించుట.

శ్రద్ధ : ఒకే వృత్తిలో మనసును నిలుపుట. ఒకే విషయాన్ని గ్రహించి నిరంతరానుసంధానం చేయటం. కాలాన్ని లెక్క పెట్టకుండటం.

సమాధి : ఆత్మానుసంధానం చేయటం.

సాధకుడు తానెవరో విచారించుకొనాలి. మూఢ విశ్వాసాలను దూరం చేసుకోవాలి. "నేను తక్కువవాడను, పనికిమాలిన వాడను" అనే హీనభావాలను విసర్జించాలి. అహోరాత్రులు నేను 'ఆత్మస్వరూపుడను' అని 'ఆత్మ – ఐక్య అనుభూతి' కలిగేవరకూ భావించాలి.

ఈ సాధనలు లేకపోతే, ఫలితం లభించదు. మనకు కైవల్యం గూర్చి తెలియవచ్చు. కాని మనం దానిని గూర్చి చెప్పలేము. చెప్పటానికి ప్రయత్నిస్తే దానికి ఒక హద్దును పెట్టిన వారమౌతాము. అప్పుడది కైవల్యం కాకుండా పోతుంది.

మనం ఇంద్రియాల హద్దులను దాటి, బుద్ధిని దాటి, అతీంద్రియానుభూతిలోకి పోవాలి. దీనికి తగిన శక్తి మనకుంది.

(మొదటి పాఠం: ఒక వారం రోజులు ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో సాధన చేసిన తర్వాత దీన్ని శిష్యుడు గురువుతో నివేదిస్తాడు.)

పాఠం – 1

మనిషిలోని వ్యక్తిత్వాన్ని వికసింపచేయటానికి ఉద్దేశించిన పాఠం ఇది. ప్రతి వ్యక్తిత్వం పరిపుష్టం కావాలి. ఈ వ్యక్తిత్వాలన్నీ కేంద్రస్థానంలో

సమన్వయమౌతాయి. "భావన లేదా ఊహాశక్తి దివ్యప్రేరణకు ద్వారం. ఈ ఊహాశక్తే ఆలోచనానికి మూలం." ఆచార్య పురుషులు, కవులు, ప్రకృతి సిద్ధాంతాలను కనిపెట్టిన వారంతా గొప్ప ఊహాశక్తి కలవారు. ప్రకృతి మనకు బయట ఉన్నా, దాని జ్ఞానం మనలోనే ఉంది. రాయి భూమిమీద పడటం జరిగేదే. అయితే ఆ భూమ్యాకర్షణరూప సిద్ధాంత జ్ఞానం మనలోనే కలుగుతుంది తప్ప బయట కలుగదు. అతిగా తినేవారు, అసలు తిననివారు, అతిగా నిద్రించే వారు, అసలు నిద్రించనివారు – యోగులు కాలేరు. అజ్ఞానం, చాంచల్యం, అసూయ, ఆలస్యం, అతిసాంగత్యం – యోగసాధనానికి బద్ధ శత్రువులు. యోగసాధనానికి కావలసిన గుణాలు మూడు.

1.బాహ్యాభ్యంతర శుద్ధి : మనసును క్రిందికి లాగే దైహిక, మానసిక మలాన్నంతా క్షాళనం చేయాలి.

2.సహనం : (సాధన కాలంలో) మొదట చాలా అద్భుత అనుభూతులు కలుగుతాయి. అయితే అవి క్రమంగా అణగిపోతాయి. ఈ దశ చాలా కఠినమైనది. కాని వదిలిపెట్టవద్దు. సాధన కొనసాగిస్తూనే ఉండాలి. సహనం వహిస్తే చివరికి ఫలితం లభిస్తుంది.

3. పట్టుదల : కష్టం వచ్చినా – సుఖం వచ్చినా, రోగం వచ్చినా – ఆరోగ్యంగా ఉన్నా – ఏది ఏమైనా ఒక్కదినం కూడా సాధనను మానరాదు.

సాధనకు యోగ్యమైన కాలం సంధ్యాకాలం. మన స్థూల – సూక్ష్మదేహాల్లోని రక్తప్రవాహాలు, భావప్రవాహాలు ఉండేకాలం. సంధ్యాసమయం రెండు స్థితులకు మధ్య నున్న సమస్థితి. ఈ సంధ్యాకాలంలో సాధన చేయటానికి కుదరకపోతే, ఉదయం నిద్రలేచిన వెంటనే, రాత్రి నిద్రపోయే ముందు సాధన చేయాలి. శారీరక శుద్ధి చాలా అవసరం. ప్రతిరోజూ శుభ్రంగా స్నానం చేయాలి. స్నానం చేసిన వెంటనే స్థిరంగా కూర్చోవాలి. నువ్వు ఒక కొండలా అచలంగా కూర్చున్నట్లు భావించుకో.

నిటారుగా కూర్చో. తల – భుజాలు – పిరుదులు వంగరాదు. వెన్నుబద్దమీద బరువు పడరాదు. వెన్నుబద్ద వెంట యోగశక్తి ప్రవహిస్తుంది. అందుకని వెన్నుబద్ద నిరపాయంగా ఉండాలి. పాదాగ్రం నుండి శిరఃపర్యంతం పరిశుద్ధంగా ఉన్నట్లు భావించాలి. భావనా సందర్భంలో ఆయా అవయవాలను మనసులో రూపొందించి, చేతితో స్పర్శించవచ్చు. తర్వాత శరీరమంతా పరిశుద్ధంగా ఉందని, అది ఈశ్వరునికి సాధనభూతంగా సమ[illegible] చేయించగలదని, ఈ సంసారవారధిని దాటించుట కది నీకు తరుణోపాయ నౌక అని భావించు. తర్వాత రెండు నాసారంధ్రాల ద్వారా లోనికి గాలిపీల్చి, బయటకి పూర్తిగా వదిలివేయి. ఓపినంతవరకు బహిః కుంభకం – అంటే గాలి పీల్చకుండా ఉంటం చేయి. ఇలా నాలుగు పర్యాయాలు చేయి. తర్వాత మామూలుగా ఉచ్ఛ్వాసనిశ్వాసాలు కొనసాగిస్తూ ఆత్మానుభూతికై ధ్యానించు. " ఈ విశ్వన్నంతా సృజించిన పరమాత్మ తేజస్సు మీద నేను ధ్యానం చేస్తున్నాను. ఆ పరమాత్మ నా బుద్ధిని సన్మార్గంలో నడిపించుగాక ! " అంటూ పది పదిహేను నిమిషాలు భావించు.

ఎవరు బ్రాహ్మణుడు?

మూలం
బుద్ధుని ధర్మపదం

అనువాదం
– బ్రహ్మచారి ఆనందమోహన్

నీ అనుభవాన్ని నీ గురువుకు తప్ప మరెవ్వరికీ చెప్పకు. వాక్ నియమం పాటించు. ఎప్పుడూ సత్ సంకల్పాలే చేస్తూండు. మనం ఏమి సంకల్పిస్తామో, అలాగే మారతాం.

ధ్యానం మానసిక మలాన్ని హరిస్తుంది. యోగులు మాత్రమే యథార్థానికి స్వతంత్రులు. తక్కినవారంతా బద్ధులు. మనం ముక్తులం కావటానికి ఒక్కొక్క బంధాన్ని త్రెంచుకోవాలి.

అంతా పరమార్థాన్ని గ్రహించగలరు. భగవంతుడు సత్యమైతే, మనకు ఈశ్వరానుభూతి కలిగితీరాలి. ఆత్మానుభూతిని మనం పొంది తీరాలి.ఆత్మానుభూతిని పొందటానికి ఒక్కటే మార్గం. అది తాను శరీరం కాదని తెలుసుకోవటం.

యోగులు ఇంద్రియాలను రెండు భాగాలు చేశారు. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు అని. అంతఃకరణం అంతరింద్రియం. **అది నాలుగు భాగాలు. 1. మనసు 2.బుద్ధి 3.చిత్తం 4. అహంకారం.**

సంకల్ప వికల్పాత్మకం మనసు : ఇది ఆలోచనాత్మకం. దీన్ని సరిగ్గా నిగ్రహించకుంటే ఈ శక్తి వ్యర్థమవుతుంది. అదుపులోకి తెచ్చుకుంటే ఇది గొప్ప శక్తిగా పరిణమిస్తుంది.

బుద్ధి : ఇది నిశ్చయాత్మకం.

అహంకారం : ఇది గర్వాత్మకం. కర్తృత్వ భోక్తృత్వరూపం.

చిత్తం యితర వృత్తుల్లోకి మారకుండా అవి కారణంగా ఉంచటానికి ఏర్పడిన శాస్త్రం యోగం. అంటే చిత్తవృత్తి నిరోధక సాధనం. తరంగాలతో కూడిన సముద్రంలో పడిన చంద్రబింబంలా, చంచల మనసులో ఆత్మ స్పష్టంగా ప్రతిబింబించదు. సముద్రంలో తరంగాలు ఆగిపోయినప్పుడు చంద్రబింబం స్పష్టంగా ప్రతి ఫలిస్తుంది. అలాగే చిత్తం నిరుద్ధమై - శాంతమైనప్పుడు ఆత్మ చిత్తంలో ప్రతిబింబించి, దర్శనయోగ్యమౌతుంది.

మనసు శరీరం వంటిది కాదు. కాని అది కూడా సూక్ష్మభూతాల వల్ల ఏర్పడిందే. మనసు చిరకాలం శరీరంలో బద్ధమై ఉండదు. మనం అప్పుడప్పుడు ఈ శరీరం నుండి పైకి లేవటం వల్ల, ఈ విషయం ఋజువవుతుంది. ఇంద్రియాలను నిరోధించటం వల్ల మనసును యిష్టం వచ్చినప్పుడెల్లా శరీరాన్నుండి వేరుచేయటం నేర్చుకొంటాం.

ఇంద్రియ నిగ్రహం అలవాటైన తర్వాత, విషయాలను నిగ్రహించాలి. మన కనుభవంలో నున్న ప్రపంచమంతా, వైషయికమైనదే. ఉత్తమస్థితికి చేరినందుకు నిదర్శనం ఒక్కటే. అదే స్వతంత్రం. నువ్వు యింద్రియాలకు దాసుడవు కాకుండా, వాటిని నిగ్రహింపగలిగితే, అప్పుడు నువ్వు ఆధ్యాత్మిక జీవితంలో అడుగుపెట్టినట్లు భావించుకో ! ఇంద్రియాకర్షణానికి లోనైనవారు వట్టి ప్రాకృతులు, ఇంద్రియాలకు బానిసలు.

చిత్తవృత్తులను నిర్మూలనం చేసి, చిత్తాన్ని ప్రశాంతంగా చేస్తే, మనం జన్మరాహిత్యం పొందినట్లే. కోట్ల కొద్ది సంవత్సరాలు శ్రమించి మనం ఈ శరీరాలను సంపాదించాం. ఈ శరీర సంపాదన శ్రమలో, వీటిని మనం ఎందుకు సంపాదించామో, ఆ మహత్తర ప్రయోజనాన్ని మరిచాం. ఆ ప్రయోజనం మోక్షం, పరిపూర్ణత్వాన్ని సంపాదించటం. శరీరాన్ని వృద్ధి చేయటమే మన ప్రయత్నాలన్నింటి ప్రయోజనమని మనం అనుకొంటున్నాం. అదే మాయ. మనం ఈ భ్రాంతిని వదిలి, మన ప్రధాన లక్ష్యాన్ని గుర్తుతెచ్చుకొని, మనం ఈ శరీరం కాదని, ఇది మనకు సాధనమే తప్ప సాధ్యం కాదని గ్రహించాలి. శరీరం భృత్యునివంటిదే సుమా !

మనసును శరీరాన్నుండి బయటికి లాగి మనం శరీరంకన్నా వేరని దర్శించటం నేర్చుకోవాలి. మనం ఈ శరీరానికి జ్ఞానం - చైతన్యం సంక్రమింపచేసి, ఇది ప్రాణవంతమైందని, యథార్థమని భావించటం మొదలు పెడతాం. చాలాకాలం ఈ తొడుగును ధరించటం వల్ల, ఈ తొడుగు మనం కాదన్న సంగతిని మరిచిపోయాం. మనం కోరినప్పుడెల్లా ఈ శరీరాన్ని దూరంగా నెట్టి ఇది మనకు సాధనమని, ఒక సేవకుడని, మనం కోరినప్పుడెల్లా చూడటానికి యోగం కావాలి. యోగసాధనంలో తొలి లక్ష్యం మనశ్శక్తులను నిరోధించటం. రెండవ లక్ష్యం వాటిని మరే విషయమందైనా లగ్నం చేయటం. ఎక్కువగా మాట్లాడేవాడు యోగి కాలేదు

(శ్రీరామకృష్ణ మఠం - హైద్రాబాద్ వారి సౌజన్యంతో సం।।)

గృహవైద్యం

శరీరం కాలగానే వెంటనే కలబంద మట్టలోని గుజును గాయాల మీద వేసి కట్టు కట్టితే మంటలు వెంటనే తగ్గి గాయం కూడా త్వరగా మానిపోయి చర్మంతో కలిసిపోతుంది.

జ్ఞానం వినా మోక్షో న సిద్ధ్యతి

- శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

స్వాత్మజ్ఞానము వలననే మోక్షం కలుగునని శృతిస్మృతులు ఘోషించుచున్నవి. గురువులు, ఆచార్యులు, పండితులు, ప్రాజ్ఞులు ఈ విషయమునే బోధించు చుండిరి. శ్రవణ, మనన, నిది ధ్యాసలచే, సద్గురువులు చెప్పిన దానినాచరించుటచే స్వాత్మతత్వ జ్ఞానము గలుగును. భగవద్గీత గీతామకరందాది గ్రంథములలో యున్న తాత్పర్యాదులను, ఈశావాస్యాది ఉపనిషత్తుల యందున్న భావములను, బ్రహ్మసూత్రాలు, పతంజలి యోగ సూత్రాలు, నారద, శాండిల్యాది సూత్రములలోనున్న విషయములను, గురువుల ముఖారవిందముల ద్వారా వింటూ, చదువుకొనుటకు వచ్చువారు, ఆయా గ్రంథములను, స్వయముగా చదువు కొనుచూ, అందులో విషయములను గ్రహిస్తూ మాటిమాటికి గుర్తు తెచ్చుకొంటూండవలెను. లక్ష్యము లేక ధ్యేయము ఆత్మవిషయ మందుంచుకొని, గృహ సంబంధ ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయాదులన్ని పనులు, ఎవరెవరికి ఏవి అనుకూలమో, ఆ పనులు చేసుకోవలెను. పనుల వలన ఆత్మజ్ఞాన సంపాదనకు ఆటంకముండదు.

శ్రీ జగద్గురు శంకరాచార్య కృత ప్రకరణ గ్రంథములగు వివేకచూడామణి, అపరోక్షానుభూతి, ఉపదేశ సాహస్రి ఇత్యాది గ్రంథములు చదువుట వలనను ఆత్మజ్ఞానము గలుగును.

ప్రతి దినము భుక్తికోసమై ఉద్యోగ, వ్యాపారాదులకు 23 గంటలు వినియోగించినను, ఆత్మజ్ఞాన గ్రంథములను అర్ధగంటయినా, 15 నిమిషములైనా చదువ వలెను. చాలామంది గీత, లలిత, విష్ణు, శివ మొదలగు దేవతల సహస్రనామ స్తోత్ర పారాయణ చేయుదురు. వాటి

తాత్పర్యములను చదువరు. మరికొందరు పూజాదులు చేయుదురు, కొందరు భజనలు, సంగీతములు చేయుదురు. వీటికి సంబంధమైన భావములను తెలుసుకోరు. కావున వాటి జ్ఞానము గలుగదు. వీటి వలన కేవలము పుణ్యము గలుగును. పుణ్యము వలన ధనము, ధాన్యం, భూములు, పెద్ద పెద్ద పదవులు ప్రాప్తమగును. వీటి వలన సుఖమల్పము, దుఃఖమనంతము. మానవుడు అనంతమైన సుఖమును పొందాలన్న మానసిక శాంతి కావాలన్న, కుటుంబ సమస్యలు నివారణమవ్వాలన్న, దేశము సర్వ సౌభాగ్యములతో విలసిల్లాలన్న, దైవానుగ్రహమును పొందాలన్న, అహంకార, రాగద్వేష ఈర్ష్యాసూయాదులు తొలగిపోవాలన్న ఆత్మజ్ఞానమును తప్పక సంపాదించుకోవాలి. ఆత్మజ్ఞానము వలన శాంతి సుఖము గలుగును. శబ్దస్పర్శరూపరస గంధాదులగు లౌకిక విషయములతో మానవునికి ఇంద్రియముల ద్వారా, తాత్కాలికమైన సుఖమే కలుగును. కాని వాటియందాసక్తి పోదు. అవి ప్రాప్తంగాక దుఃఖము, ప్రాప్తమైన అనారోగ్య దుఃఖము కలుగును.

బోధోఽన్య సాధనేభ్యో హి సాక్షాన్మోక్షైకసాధనమ్
పాకస్యవహ్నివత్ జ్ఞానం వినా మోక్షో న సిద్ధ్యతి ” ॥

మోక్షమునకు సాక్షాత్ సాధనం, ఏకైక సాధనం ఆత్మజ్ఞానమే. అన్నము, కూరలు మొదలగునవి వండుటకు సాక్షాత్సాధనము అగ్ని. వంట సామానులు ఎన్ని వున్నా అగ్ని లేనిదే అన్నాదులు ఎట్లు కావో, ఆ విధంగా జప, ధ్యాన, యోగ, పూజా, సేవాదులు ఎన్ని వున్నా ఆత్మజ్ఞానము లేనిదే మోక్షం కలుగదు. జపధ్యానాదులకు ఫలితమున్నది. వీటి ద్వారా మనస్సు ఏకాగ్రత చెందును. బుద్ధి పరిశుద్ధమగును. పుణ్యం గలుగును. పాపం వినాశమగును. “ జపతో నాస్తి పాతకమ్” అని శాస్త్రము, పెద్దల వచనము. “యజ్ఞానాం జప యజ్ఞో ఽస్మి” యజ్ఞములలో జపమనెడి యజ్ఞమును నేనే అయి వున్నాను అని శ్రీ కృష్ణ వచనము

ఏ దోషాలు సంభవించనిది జపయజ్ఞం. జనులందరూ వారి వారి ఇష్టదేవతా నామమును ప్రతిదినం 5 లేక 10 నిమిషములు స్మరించిన జపమగును. వారి వారి శక్త్యానుసారము పూజా, భజన, సేవాదులు చేయవలెను. వీటి ద్వారా ఆత్మజ్ఞానమును ధరించుటకు బుద్ధి యోగ్యమైనది యగును. "బుద్ధ్యా విశుద్ధయా యుక్తః" అని గీతా వాక్యము.

కర్మలు సాక్షాత్తుగా జ్ఞానమును ఎందుకు కలిగించవు అని ప్రశ్న వుదయమైతే ఆచార్యులవారు ఆత్మబోధ అనే గ్రంథములో నీ విధంగా తెలిపియున్నారు.

శ్లో ॥ నావిరోధితయా కర్మ నావిద్యాం వినివర్తయేత్ ।

విద్యా ఽ విద్యాం నిహన్త్యేవ తేజస్తిమిర సంగవత్ ॥

అవిద్య యనగ అజ్ఞానము – కర్మకు, అజ్ఞానమునకు విరోధము లేదు. కావున పుణ్య కర్మల వలన, యజ్ఞయాగాదుల వలన స్వర్గాది ఉత్తమ లోకములు ప్రాప్తమగును. అచ్చట సుఖ భోగములననుభవించి మరల మానవ లోకమునకు వచ్చును. ఈ కాల చక్రము నీ తీరుగ తిరుగుచుండును. దేహ తాదాత్మ్యమనెడి అజ్ఞానము కర్మల వలన నాశము కాదు. పాప కర్మల నాచరించిన నరకాది లోకములలో దుఃఖ భోగమను భవించి మానవ లోకమునకు వచ్చును. ఎక్కువ పాపములు చేసిన పశుపక్ష్యాది జన్మల నొందును. ఘోరాతి ఘోర పాపములు చేసిన క్రిమికీటకాదులై మాటిమాటికి పుట్టుచు చచ్చుచుండును. కర్మలకు అజ్ఞానమును ఛేదించే శక్తి లేదు.

విద్య యనగా జ్ఞానము. జ్ఞానమువలననే అజ్ఞానము నాశమగును. చీకటిఅంధకారం నశించుటకు కేవలము వెలుతురు ప్రకాశమే కారణము. వెలుతురు వలననే చీకటి నశించునట్లుగా జ్ఞానము వలననే అజ్ఞానము నశించును. చీకటి పోవాలని ఎన్ని కర్మలు చేసినను చీకటి పోదు.

చీకటికి – వెలుతురుకు విరోధము కావున వెలుతురు రాగానే చీకటి పోవును. జ్ఞానమునకు అజ్ఞానము విరోధి. కావున జ్ఞానము కలుగగా అజ్ఞానము నశించును.

జడమైన శరీరము, బుద్ధి, మనస్సు, ఇంద్రియములు నేను కాను. వీటన్నిటికి సాక్షి స్వరూపమైన, నిత్యశుద్ధ బుద్ధ ముక్త స్వరూపుడునైన పరమాత్మనే నేను అని దృఢాపరోక్ష జ్ఞానము గలిగి 'అహం బ్రహ్మాస్మి, బ్రహ్మైవాహమస్మి, అని భావించవలెను. ఈ భావనా స్థితియే మోక్షం. ఇదియే స్వాత్మజ్ఞానము.

ఓం లోకాస్సమస్తాస్సుఖినో భవంతు. ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః

– శ్రీ మాతా గురుచరణానన్ద

త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుకు క్రిందివారు పైకం పంపినారు

1. అత్యం వెంకటాచలం (పెనుగొండ, ప.గో.జిల్లా) – రూ.56,630/-
2. కోట్ల మీనాలక్ష్మి (పెనుగొండ, ప.గో.జిల్లా) – రూ.21,630/-
3. గోలి రామారావు (రాజమండ్రి) – రూ.10,000/-
4. ఎన్.వి. గిరియప్పసెట్టి & బ్రదర్స్ (బెంగుళూరు) – రూ.10,000/-

---

సద్గురు సర్వ సేవా ట్రస్టుకు క్రిందివారు పైకం పంపినారు

1. ఆచార్య కృష్ణానందస్వామి (జడ్చర్ల) – రూ.10,000/-
2. నన్నపనేని పూజిత (నోయిడా.యు.పి.) – రూ.10,000/-
3. ఎస్.నాగిరెడ్డి (పెనుమంట్ర. ప.గో.జిల్లా) – రూ. 15,000/-
4. గోలి రామారావు (రాజమండ్రి) – రూ.15000/-
(మామ వేగుళ్ల జానకిరామయ్య పేరిట అన్నదాన నిధి)
5. గోలి ప్రియంవద (రాజమండ్రి) – రూ.15000/-
(తల్లి వేగుళ్ల ప్రభావతి పేర అన్నదాన నిధి)

శ్రీ మలయాళస్వామి జీవిత విశేషాలు - ౨
శుష్క వేదాంతి బహిష్కరణం

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

వేలప్ప ప్రాథమిక పాఠశాలలో చదువుకొనే రోజులవి. ఒకనాడొక సాధువు వేలప్ప స్వగ్రామమైన ఎన్గద్యూరికి వచ్చాడు. జడలు, కాషాయం, రుద్రాక్షలు దాల్చి వచ్చిన అతణ్ణి చూచి గ్రామస్థులు ఘనంగా ఆదరించారు.

సాధువు వేదాంత బోధకు ఉపక్రమించాడు. అలా ఉపన్యాసం కొనసాగిస్తూనే ఒకనాడిలా చెప్పాడు. "నేను బాల్యంలోనే కాశీకి పోయాను. అక్కడ గురుకులంలో చదువుకొన్నాను. మహనీయులను సేవించాను. వారి అనుగ్రహంతో దివ్య సిద్ధులు పొందాను. ఇచటి వారిని తరింపజేయడానికి ఇప్పుడు తిరిగి వచ్చాను "

ఆస్తిక్యబుద్ధిగల ఆ గ్రామస్థులు 10 రోజులక్కడనే ఉండి వేదాంత బోధ చేయవలసినదిగా అతణ్ణి ప్రార్థించారు. అతడందు కంగీకరించాడు.

వేలప్ప ఆ సాధువుని గమనించాడు. అతనికి మిక్కిలి సన్నిహితుడై మెలగజొచ్చాడు. రెండు రోజులలా గడచాయి. మూడవ నాడు ఆ సాధువు గ్రామస్థులకు ఒక రుద్రాక్ష మాల చూపి " దీనిని కాశీ క్షేత్రం నుండి తెచ్చాను. గురుకృపచే నాకిది లభించింది. ప్రాతః కాలంలో, సాయం వేళలోనూ దీన్ని ముద్దజేసి పిండితే ఇందులో నుండి గంగాజలం స్రవిస్తుంది. ఆ జలం పావనమైనది, పాపాలను పరిహరిస్తుంది. ఇది ఓ చెంచా వెల ఒక్క రూపాయి మాత్రమే. కావలసినవారు తీసుకోవచ్చు" అని ప్రకటించాడు.

ప్రజలు ఆ గంగాజలానికై ఎగబడ్డారు. సాధువు ధనపేటిక నిండ సాగింది. వేలప్పకు మాత్రం సందేహం కల్గింది. రుద్రాక్ష మాల రహస్యం

ఏమిటా ? అని ఆ అబ్బాయి ఆలోచించసాగాడు. సత్యాసత్య పరీక్ష చేయాలనుకొన్నాడు. ఆ సాధువుకు మరీ సన్నిహితంగా మెలగసాగాడు.

ఒక దినం సాధువు స్నానానికి వెళ్ళినప్పుడు గదిని పరికించాడు. ఒక మూల పెట్టెలో దాచిన రుద్రాక్ష మాల కనిపించింది. అది నిజమైన రుద్రాక్ష మాల కాదు. జీలుగు బెండు వంటి మెత్తని పదార్థంతో తయారు చేసిన మాల అది. నీట ముంచినప్పుడు నీరు పీల్చుకొంటుంది. ఒకపూటకు ఒక్కసారి మాత్రమే అలా పిండవచ్చునని సాధువు చెప్పాడు. మాటి మాటికి జనుల ముందు దానిని పిండటం వీలుపడదు గదా !

వేలప్ప మాలా రహస్యాన్ని పెద్దల చెవికెక్కించాడు. వారు సత్యం గ్రహించి సాధువును చీకొట్టి తరిమివేశారు. వేలప్పను మెచ్చుకొన్నారు.

ఇలా శుష్క వేదాంతుల సునిశిత పరిశీలన వేలప్పకు వెన్నతో బెట్టిన విద్య అయింది. ఈ పరిశీలనే ఆ తరువాత అతని చేత "శుష్క వేదాంత తమో భాస్కరం" వంటి గ్రంథాలను వ్రాయించింది.

> వినదగు నెవ్వరు చెప్పిన
> వినినంతనె వేగపడక వివరింపదగున్,
> కని కల్ల నిజము దెలిసిన
> మనుజుడె పో నీతిపరుడు మహిలో సుమతీ !

వేదాన్తభేరికి ఈ క్రిందివారు పోషక చందా పంపినారు

01. నాగేశ్వరరావు & కనక దుర్గాంబ (గుంటూరు) - రూ.1500/-
02. జోగేంద్రనాథ్ (కొల్లాపూర్, నాగరకర్నూలు జిల్లా)-రూ.1500/-
03. వి.సూర్యనారాయణమూర్తి (పానంగిపల్లి) - రూ.1500/-
04. టి.అనిల్ (నాంపల్లి, హైద్రాబాద్) - రూ.1500/-
05.కె.చిన్నమనాయుడు (గుమ్మలపాడు, విశాఖపట్నం) - రూ.1200/-

అమృతానుభవము

మూలం : సంత్ జ్ఞానేశ్వర్ మహరాజ్

అనువాదం : నైనారు అప్పాస్వామి

పూర్ణుడైయుండు చంద్రుడు పున్నమందు
తిమిర నిశలందు నారీతి తీరియుండు
తరుగ దాతని నిజరూపు తరచిచూడ
మరుగు పడుటయేగాని ఏ మార్పు రాదు 6

అన్న మందుండి కలుగదా యర్కుకాంతి
చీకటుండదు సూర్యుని చెంతనెపుడు
రవికి సారూప్యమెంచగ రవియె యగును
వేరొకటి సూర్యుడన కడు వెఱ్ఱియగును 7

భాసిలదు లోకదృష్టిచే ప్రజ్ఞయెపుడు
మందగించదు భ్రాంతిచే మహిత ప్రజ్ఞ
పరమమైనది జ్ఞానంబు ప్రజ్వలించు
దృష్టి వేరుగ నుండునే ద్రష్టకన్న? 8

ఇంద్రియార్జిత విషయంబు నెన్నగాను
జ్ఞానమనరాదు, నిత్యమై జ్ఞానమలరు
పూర్ణమది విశుద్ధమగుచు పొలయుచుండు
అనుభవైక వేద్యంబది యనగజెల్లు 9

అంబరము తన లోపలికరుగ గలదె?
తనను తానగ్ని దహియింప తరమె చూడ?
ఎవ్వడేనియు తన శిర మెక్క గలడే??
చూపు తనను తానెటులైని చూడ గలదె? 10

తన చవినెరుగ రుచికెట్లు తరము గలుగు?
వినగలదె శబ్దము తనదు ధ్వనిని తాను ?
ఫలము మరియొక ఫలమును బడయగలదె ?
పరిమళము తన సౌగంధ్య మెరుగ గలదె ? 11

వీటికన్నింటికి బదులు "వీలుగాదు"
గోచరింపని జ్ఞానంబు గుణములోన
కాదు నిజమగు జ్ఞానంబు లేదు విలువ
ఆత్మ నిత్యత్వ మెరుగు యతి పరమము 12

ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే

– శ్రీ మాతా కృష్ణానందగిరి స్వామిని (గూడవల్లి)

(ఈ రచయిత పూర్వాశ్రమంలో వేజెండ్ల కృష్ణకుమారి గారు . శ్రీ వ్యాసాశ్రమ కన్యా గురుకులంలో విద్యనభ్యసించి, ఆపై పట్టభద్రురాలై గుంటూరు జిల్లా ప్రధాన పాఠశాలలో,ఆ తరువాత ప్రభుత్వ కళాశాలలో లెక్చరరుగా వుండి, ఇపుడు శ్రీ వ్యాసాశ్రమ పీఠాధిపతులు పరమ పూజ్య శ్రీ విద్యానందస్వాముల వారి వద్ద సన్న్యాసమును తీసుకొని గూడపల్లి మైత్రేయాశ్రమాధిపతిగా వుంటున్నారు. సం॥)

మూకం కరోతి వాచాలం నిర్బుద్ధిం బుద్ధిమత్తమమ్
యత్కృపా తమహం వందే హ్యసంగానంద సద్గురుమ్ ॥

'పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే ॥

అని శ్రీ కృష్ణభగవానుడు గీతలో సెలవిచ్చియుండెను. సజ్జన సంరక్షణకు, దుష్టులను శిక్షించుటకు, ధర్మమును స్థాపించుటకు ప్రతి యుగమునందును భగవంతుడవతరించునని పై శ్లోకము వలనఁ దెలియుచున్నది.

ఈ వాక్యము శ్రీ మహర్షి సద్గురు మలయాళ స్వాములవారి విషయములో అక్షరశః సత్యమైనది. శ్రీవారు దుష్ట శిక్షణకు, శిష్ట రక్షణకు, ధర్మ సంరక్షణకు జీవితము నంకితము చేసిరి.

ఆనాడు 'అంతా బ్రహ్మమయము, నేను పరబ్రహ్మ స్వరూపమును, దేహముతో నెట్టి దుష్కార్యము లాచరించినప్పటికిని అవి ఆత్మకు అంటవు' అని కొందరు వాచావేదాంతులు దుష్కృత్యము లాచరించుచుండెడివారు.

బ్రహ్మచర్యము, అహింస, సత్యము పలుకుట మున్నగు నియమములను వదలి నీతిదూరులై స్వేచ్ఛగా ప్రవర్తించెడివారు. అట్టి సమయమున శ్రీవారు 'శుష్కవేదాంత తమో భాస్కరము' మున్నగు గ్రంథములను రచించి వారి దుష్కృత్యములను ఖండించిరి. ఈ రీతిగా శ్రీవారు దుష్టశిక్షణ గావించిరి.

ఆనాడు ప్రణవాది మంత్రములను బ్రాహ్మణేతరులు, స్త్రీలు వినగూడదనియు, భగవద్గీతాది గ్రంథములు స్త్రీ, శూద్రాదులు పఠింపరాదనియు బ్రాహ్మణులు చెప్పుచుండెడివారు. ఆ పరిస్థితులలో శ్రీవారు స్త్రీ, శూద్రాదులున్ను ప్రణవాది మంత్రములను జపించ వచ్చుననియు, భగవద్గీతాది గ్రంథములను పఠింపవచ్చుననియు తెల్పిరి. మొదట సనాతనులైన బ్రాహ్మణులు ఎన్నో విఘ్నములు కలిగించిరి. అయినను ధైర్యము వీడక తమ సహజ ప్రజ్ఞావాదనలతో యుక్తమగు ననేక శాస్త్ర ప్రమాణములను చూపుచు వారి కుయుక్తులను ఖండించిరి. అంతేగాక, బ్రహ్మవిద్యా వ్యాప్తికొఱకనేక విధముల గృషి యొనర్చిరి. శ్రీ వ్యాసాశ్రమమున బ్రహ్మవిద్యా పాఠశాలను నెలకొల్పి, అక్షరజ్ఞానము లేనివారికి గూడ భగవద్గీతాది గ్రంథ పఠనమును నేర్పిరి. స్త్రీలు కూడ బ్రహ్మవిద్య నభ్యసించుట కర్హులని తెల్పుటకు కన్యాగురుకులమును స్థాపించిరి. పుట్టుక చేత మాత్రమే బ్రాహ్మణాది వర్ణము లేర్పడవనియు, గుణములను బట్టి బ్రాహ్మణాది వర్ణములను నిర్ణయింపవలెననియు, వేదాధ్యయనము చేయుటకు స్త్రీ, పురుషుల కిరువురికి సమానాధికారము కలదనియు ననేక శాస్త్ర వాక్యములచే నిరూపించి శిష్ట రక్షణ గావించిరి.

శ్రీవారు పరమత దూషణకు పాల్పడక, సర్వ మతముల సారమును గ్రహించి సనాతన వేదాంత జ్ఞానసభా సంచాలనము, చాతుర్మాస్య వ్రతాచరణాదుల ద్వారా ధర్మమును స్థాపించిరి. 'యథార్థ భారతి' మాసపత్రిక ద్వారా వివిధ గ్రంథములను రచించుట మూలమునను ధర్మప్రచారమును గావించిరి.

'యద్యదాచరతిశ్రేష్ఠః తత్తదేవేతరోజనః' యను భగవద్వాక్యము నందు విశ్వాసము కలవారగుటచే శ్రీవారు లోకహితము కొఱకు తాము చెప్పిన ప్రతి వాక్యమును తు.చ. తప్పక అనుష్ఠించి చూపెడివారు.

'నానుష్ఠానా త్పరంకార్యం త్రిషులోకేషు విద్యతే।
సత్యం సత్యం పునస్సత్యం ఇతి మామక భాషితమ్ ॥

అనునది శ్రీవారి సూక్తి. అనుష్ఠానమునకు మించిన తపస్సు లేదని వారి దృఢ నిశ్చయము. 'ఆచరణ లేని ఉపన్యాసము మందులేని తుపాకి మ్రోతవంటిది. మన మాచరింపని వాక్యమును మనము చెప్పినంత మాత్రముననే ఇతరులు విని యాచరింతురనుట కల్ల. జీవితాంతము వఱకు ఒక్క నియమము పాటించినను వారి జన్మ సఫలము. నియమపూర్వకమైన జీవితమును గడపినపుడే మానవ జన్మకు సార్థకత. ప్రతి దినము తెల్లవారుజామున లేచుట, దైవ ప్రార్థన, భగవద్గీతాది గ్రంథపఠనము మున్నగువానిలో నేదేని ఒక్కటైనను జీవితాంతమువరకు ఆచరించిన వారి జన్మ ధన్యమగును' అని శ్రీవారు తెల్పుచుండెడివారు.

శ్రీవారు బోధించు వాక్యములలో 'నశ్రేయో నియమం వినా' అనునది ప్రధానమైనది. నియమము లేనిదే శ్రేయస్సు గలుగదని వాక్యార్థము. శ్రీవారు ఎంతటి నియమబద్ధమైన జీవితమును గడిపెడివారో వారి దర్శన భాగ్యము కలిగిన ప్రతివారికిని తెలియును. శ్రీ వ్యాసాశ్రమములో ప్రతికార్యము నియమానుసారముగ జరుగ వలసినదే. ఈ రోజులలో పత్రిక నడుపుటయే కష్టసాధ్యమైన పని. ఆధ్యాత్మిక పత్రికలను నడపుట మరింత కష్టముగదా. అయినను శ్రీవారిచే నెలకొల్పఁబడిన "యథార్థ భారతి" మాత్రము ప్రతి నెల 15వ తేదీ నేటి వరకు అవిచ్ఛిన్నముగా వెలువడుచునే ఉన్నది.

కన్యా గురుకుల విద్యార్థినులమైన మాకు శ్రీవారు ఎన్నో హిత

వాక్యముల నుపదేశించెడివారు. ప్రతి శనివారము సాయంకాలము కన్యా గురుకుల విద్యార్థినులకు ప్రత్యేకముగా సమావేశము ఏర్పాటు చేసెడివారు. అట్టి సమయమున విద్యార్థినులకు ఒక్కొక్కసారి ఒక్కొక్క సమస్య నిచ్చి సమాధాన మిమ్మనెడివారు.

ఒకనాడు 'మీ మతమేది? అని ఎవరైనా మిమ్ములను ప్రశ్నించినచో మీరేమి సమాధాన మొసగుదురు? ' అని ప్రశ్నించిరి. బాలికలమగు మేము అప్పటికి తోచినట్లుగ 'మాది హిందూ మతము, మా దైవము శివుడు, కృష్ణుడు, రాముడు' అని పలు తెఱగుల సమాధానము లిచ్చితిమి. చివరకు శ్రీవారు 'అట్లు కాదు, మాది సనాతన మతము, సమస్త మతములకు ఏది మూలమో అదియే మా మతము. బుద్ధుడు, క్రీస్తు, నానక్, మహమ్మద్ ప్రవక్త మొదలగు సమస్త మత ప్రవక్తల హృదయముల నేది ప్రకాశింపఁజేసెనో, ఆ స్వయం ప్రకాశ స్వరూపమైన జ్ఞానము మా మతము' అని సమాధానము చెప్పవలెనని తెల్పిరి.

మరియొకనాడు 'మీ రందరును బ్రహ్మచారిణులు, సన్యాసినులు నైనచో ప్రపంచ వ్యవహారము లెట్లు జరుగును? సృష్టికి విఘాతము కలుగదా? ' అని మిమ్ముల నెవరైన ప్రశ్నించినచో మీరేమి సమాధానము చెప్పెదరు? అని శ్రీవారు బాలికలను ప్రశ్నించిరి. విద్యార్థినులు నిరుత్తరులు కాగా శ్రీవారే ఇట్లు చెప్పిరి. 'ఇది కేవలము పిచ్చి ప్రశ్న. ఈ ప్రశ్న ఎట్లున్నదనగా వైద్య విద్య నభ్యసించు విద్యార్థియొద్దకేగి మీ రందఱును డాక్టరులయినచో మీ యొద్దకువచ్చు రోగులెవరు? అని ప్రశ్నించినట్లుండును. అట్లే న్యాయ శాస్త్రము నభ్యసించు వారియొద్ద కేగి ' మీరందరును న్యాయవాదులయినచో మీ యొద్దకు కేసు లెవరు తీసికొని వత్తురు? అని అడిగినట్లుండును. ఈ విధమైన ప్రపంచ విషయములలో లేని సందేహము బ్రహ్మవిద్య నభ్యసించువారి విషయమున మీకేల కల్గెనని మీరే వారిని ప్రశ్నింపవలెను'. ఇట్లు శ్రీవారు విద్యార్థినులకు

యుక్తియుక్తమగు సమాధానములను తెల్పుచుండెడివారు. అలా విద్యార్థినులను శ్రీవారు అనేక విధముల ఉత్సాహపరచుచుండెడివారు. ఆనాటి విద్యార్థినులమగు మేము ఎప్పుడు శనివారము వచ్చునా? అని ఉత్సాహముతో ఎదురుచూచెడివారము.

అల్ప విషయమునందును శ్రీవారి విశాలభావము వ్యక్తమగు చుండెడిది. శ్రీవారు పరులచేతిక్రింద తమ చేతినెప్పుడును ఉంచలేదు. దీనివలన ఇతరులను యాచింపరాదని స్పష్టమగుచున్నది. 'ప్రపంచములో దేనికిని లొంగకుము. లొంగినచో ప్రతి చిన్న విషయమునకు, అల్పులైన వారికి గూడ లొంగవలసి వచ్చును ' అనునది శ్రీవారి సూక్తి.

దుర్జన స్సజ్జనోభూయాత్ సజ్జనశ్శాన్తిమాప్నుయాత్ ।
శాంతోముచ్యేత బంధేభ్యో ముక్తశ్చాన్యా న్విమోచయేత్ ॥

అని శ్రీవారు సమస్త ప్రజలకు కర్తవ్యము నుపదేశించిరి. ఈ విధముగా తాము నమ్మిన సత్యమును ఆచరించిన మహనీయులు, అవతార వరిష్ఠులు మన గురుదేవులు.

తండ్రీ! సద్గురుదేవా! భవదుక్త మార్గమున పయనించు అదృష్టమును, అవకాశమును కల్పింపుము. ప్రభూ! మా హృదయములందు అనన్య దైవభక్తియు, సద్బుద్ధియు, విరక్తియు వర్ధిల్లునట్లు ఆశీర్వదింపుము.

ఓమ్ జయ్ గురుదేవ్

శ్రీ మలయాళస్వాములవారి 56వ పుణ్యారాధన

పరమ పూజ్య సద్గురు మహర్షి మలయాళస్వాములవారి 56వ పుణ్యారాధన (ఆషాఢ శుద్ధ ఏకాదశి) జూలై 22, 23, 24వ తేదీలందు మాతృశ్రీ అనసూయమ్మ గారి ఆధ్వర్యంలో శ్రీ మలయాళస్వాములవారి గీతా సమాజాల ద్వారా ఏలూరు (ప.గో.జిల్లా) పట్టణం సత్రంపాడు, శ్రీ కార్తిక్ ప్రాంగణంలో జరుగును. అందు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు పాల్గొంటారు.

సువర్ణ సోపానములు

– పాణ్యం రామనాథ శాస్త్రి

(కర్నూలు జిల్లా – కోవిలకుంట్ల వాస్తవ్యులు శ్రీ శాస్త్రి గారు. థీసాఫికల్ సొసైటీలో ప్రముఖ వ్యక్తి. మంచి వక్త మరియు రచయిత. వీరిపుడు లేరు సం॥)

1. పరిశుద్ధ జీవనము : సాధకుని దివ్యజ్ఞానాలయం చేర్చగల సువర్ణ సోపానములను దివ్యజ్ఞాన సమాజ సంస్థాపకులైన హెచ్.పి. బ్లావట్స్కి గారు ప్రతిపాదించినారు. ఈ సోపాన పంక్తిలో మొదటి సోపానం పరిశుద్ధ జీవనము.

సామాన్య మానవుని జీవితము శుద్ధంగా వుండాలి. కాని సాధకుని జీవితం పరిశుద్ధంగా వుండాలి. మానవుని జీవితము బాహ్యము. ఆంతరంగికం అని రెండు అంతస్తుల్లో వుంటుంది. ఈ రెండు శుద్ధంగా వుండినపుడే సాధకుడు సువర్ణ సోపానాల్లోని రెండవ మెట్టును అధిరోహించగలడు.

మొదట బాహ్య జీవితాన్ని గురించి ఆలోచిద్దాము. శరీరము, ఇల్లు, పరిసరాలు, ఇతరులతో ప్రవర్తించే తీరు, ఇవన్నీ బాహ్య జీవితములోని ముఖ్యాంశాలు. (శారీరకమునకు సంబంధించిన విషయాలు) అన్నీ పరిశుద్ధంగా వుండేటట్లు ప్రవర్తించాలి. ఇట్లాంటి ప్రవర్తనను భగవద్గీత శారీరక తపస్సు అని పేర్కొన్నది. (దేవద్విజ గురు ప్రాజ్ఞపూజనం, శౌచం, ఆర్జవం: బ్రహ్మచర్యం, అహింసాచ , శారీరం తప ఉచ్యతే).

భారతీయ సంస్కృతిలోని ప్రతి అంశము జీవిత లక్ష్యమైన మోక్షాన్ని పొందేదిగా రూపొందించబడింది. ఏమి చేసినా అది దివ్యంగా, భవ్యంగా వుండాలి. ఇట్లాగా నిపుణతతో చేయు కర్మ యోగంగా భావించింది భగవద్గీత. పనులు చక్కగా చేయాలంటే శ్రద్ధ అవసరం. చేసే పనులు

చేసేవారికి, ఇతరులకు హితంగా వుండాలి. అశ్రద్ధతో చేసే పనులు అసహ్యంగా, అస్తవ్యస్తంగా వుంటాయి. మానవ జీవితం దేవహితంగా వుండాలంటుంది వేదం. (వ్యసేమ దేవహితం యదాయుః). లోకహితంగా వుండే కర్మలన్నీ అందంగా, ఆనందదాయకంగా వుంటాయి. భగవంతుడు సత్య, సుందర, శివుడుగా వర్ణింబడినాడు. మన కర్మలు సత్యంగా, సుందరంగా, హితంగా (శివంగా) వున్నప్పుడు అవి భగవత్ప్రీతికరంగా వుంటాయి. ప్రకృతిని పరిరక్షించే కర్మలన్నీ దేవహితాలని చెప్పవచ్చు. ఎందుకంటే, పృథివ్యాపస్తేజోవాయురాకాశాలు ప్రత్యక్ష దైవతాలు. కనుక ప్రకృతిని కలుషితం చేయక, పరిశుద్ధంగా వుంచే కర్మలన్నీ బాహ్యశుద్ధికి సంబంధించినవి. ప్రకృతిలోని ముఖ్య లక్షణం సహజీవనం. సమరస సహజీవన విధానాన్ని ప్రతి ఒక్కరు ఆచరణలో పెట్టగలిగితే కుటుంబాలు, గ్రామాలు, దేశాలు అన్ని శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లుతాయి. కనుక బాహ్య పరిశుద్ధ జీవనానికి సమరస జీవిత విధానం ముఖ్యమైనది. ఇతరులకు బాధ కలిగించకుండా సవ్యంగా జీవించగల్గుట వలన సర్వప్రాణులు సుఖంగా జీవించగల్గుతాయి.

ఇంక అంతరంగ పరిశుద్ధత ననుసరించి ఒకింత యోచిద్దాము. అంతశ్శుద్ధి కోరికలకు, ఉద్రేకాలకు, మనసుకు సంబంధించినది. ప్రతి ఒక్కరికి సామాన్యంగా కోరికలు ఉండక తప్పవు. కాని ఆ కోరికలు శుద్ధమైనవిగా వుండాలి. ఆశ వుండుట ప్రకృతి సిద్ధం. కాని దురాశ వుండరాదు. తాను, తన కుటుంబము సుఖంగా వుండాలనే కోర్కె మంచిదే. కాని ఈ కోర్కెలు ఇతరులకు బాధాకరంగా వుండరాదు. ఇతరులకు అప్రియము కలిగించే కోరికలు వుండరాదు. ఈ విషయంలో భారతం మనకు చక్కటి మార్గాన్ని బోధిస్తుంది.

'ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తనమనంబునకగు

తానొరులకవి చేయకునికి, పరాయణము పరమధర్మపథములకెల్లన్"

దీన్నే సంస్కృతంలో 'ఆత్మనఃప్రతికూలాని పరేషాంన సమాచరేత్" అనే సూక్తి వ్యక్తం చేస్తుంది. చతుర్విధ పురుషార్థములు భారతీయ

సంస్కృతిలో ప్రశస్తమైన జీవన మార్గాన్ని బోధిస్తాయి. ధర్మంతో కామాన్ని, ధర్మంతో అర్థాన్ని పొందగలిగితే మోక్షము కరతలామలకము. అట్లాగే మన ఉద్రేకాలు ఇతరులకు బాధాకరంగా వుండరాదు. ఉద్రేకాలు, కామనలు పరిశుద్ధంగా వుండాలంటే మనసు పరిశుద్ధంగా వుండాలి. “మనసే స్వర్గానికి, మోక్షానికి కారణము” అనే ఆర్యోక్తి సుప్రసిద్ధం. మనసును స్థిరంగా, నిర్మలంగా వుంచాలి. ఇతరులకు అపకారం కల్గించే తలంపులు మనసులోకి రాకుండా నిగ్రహించాలి. మనసును నిగ్రహించుట చాలా కష్టం. కాని అభ్యాసంచేత, వైరాగ్యంచేత నెమ్మదిగా మనసును స్వాధీనము చేసుకోవచ్చు. స్వాధీనమైన మనసు మానవునికి మోక్షం చేకూర్చగల్గుతుంది. మనసును నిగ్రహించాలంటే వివేకం కావాలి. వైరాగ్యం కావాలి. ప్రాపంచిక సుఖభోగాలు అనిత్యములు, అశాశ్వతములని అనుభవపూర్వకంగా తెలుసుకుంటే మనస్సును నిగ్రహించవచ్చు. యమనియమ ఆసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యానధారణ సమాధులనే అష్టాంగ మార్గాలను అనుసరిస్తే మనసును నిగ్రహించవచ్చు అని పతంజలి మహర్షి యోగసూత్రాల్లో బోధించినాడు. ఈ ఎనిమిది మార్గాలు బాహ్యాభ్యంతర పారిశుద్ధ్యాన్ని పెంపొందించ గలుగుతాయి. కనుక బాహ్య శుద్ధి, అంతశ్శుద్ధి పొందగల్గితే మానవ జీవితం సుఖశాంతులతో రాణించ గల్గుతుంది. యోగి వేమన బాహ్యాభ్యంతర శుచులను గురించి చక్కగ బోధించినాడు.

ఆత్మశుద్ధి లేని ఆచారమదియేల ? భాండ శుద్ధి లేని పాకమేల?
చిత్తశుద్ధి లేని శివపూజ యేలరా? విశ్వదాభిరామ వినురవేమ.

కనుక శుచి, శుభ్రత జీవితరంగాలన్నింటిలో ఆచరించగల్గితే మానవ జీవితం సుఖశాంతులతో అలరారుతుంది. సువర్ణసోపానాల్లోని ఈ ప్రథమ సోపానాన్ని అధిరోహించగలిగితే, మిగతా సోపానాలను అధిరోహించుట సులభమవుతుంది. మొదటి అడుగు సక్రమంగా వేస్తే మిగతా అడుగులు కూడ సక్రమంగా వుండగలవు.

ధర్మ ప్రచారకులు సద్గురు మహర్షి శ్రీ మలయాళస్వాములవారు

– శ్రీమతి బొప్పన అరుణాదేవి (హైద్రాబాద్)

(ఈ రచయిత్రి శ్రీమతి బొప్పన అరుణాదేవి గారు శ్రీ మలయాళ స్వాములవారి భక్తురాలు. మంచి పరిణత, ఆధ్యాత్మిక గ్రంథ రచయిత్రి .గురుత్రయ బోధలు అను గ్రంథంలోని వీరి వ్యాసంలోనిదీ భాగము సం॥)

సద్గురు మహర్షి శ్రీ మలయాళస్వాముల వారికి శ్రీమద్భగవద్గీత అంటే అంతులేని విశ్వాసము.భక్తి, సత్య నిర్ణయము, ధర్మపరత్వము భగవద్గీత స్వరూపమని శ్రీవారి అభిప్రాయము. ఆంధ్ర భాషలో మొట్టమొదటిగా గీతకు పద విభాగము వ్రాసినది సద్గురు దేవులే. పదముల యొక్క విభాగాలు తెలియకపోవడం చేత భగవద్గీతను అందరు సులభంగా పారాయణం చేయటం సాధ్యము కాదు. అంతేకాక అందులోని పదాల అర్థాన్ని వారు గ్రహించలేరు. దీనిని దృష్టిలో ఉంచుకొని స్వాములవారు శ్రీమద్భగవద్గీతకు పదవిభాగము, ప్రతి పదార్థము, తాత్పర్యము, విశేషార్థము వ్రాశారు.

ఈశావాస్యము మొదలయిన ఉపనిషత్తులను, మన్వాది స్మృతులను, బ్రహ్మగీత మొదలయిన గీతలను, భాగవతాది పురాణాలను, భారతము మొదలయిన ఇతిహాసములను, పాతంజలి యోగ సూత్రాలను, బుద్ధుడు, క్రీస్తు, మహమ్మదు మొదలైన ప్రవక్తల మత గ్రంథాలను సద్గురు దేవులు బాగా అధ్యయనం చేసి వాటిలోని సారాన్ని గ్రహించారు. కాని శ్రీమద్భగవద్గీతలోని అంతరార్థము కన్నా అధికమయిన సారము వాటిలో కనిపించలేదు. ఈ కారణము చేత గురుదేవులకు భగవద్గీత అంటే చాలా ఇష్టము.

వర్ణాశ్రమ ధర్మములు సనాతనములు అని ఉద్ఘోషించే వారిని

గురించి, సామాన్య ప్రజలు వాటిలోని అసలు రహస్యాన్ని, సత్యాన్ని బాగా తెలుసుకోవటం కోసమే తాను భగవద్గీతకు విశేషార్థాన్ని రచించానని శ్రీవారే చెప్పారు. సనాతన ధర్మము అంటే సాంఖ్య యోగములో 24వ శ్లోకములో ఆత్మను గురించి చెప్పినదే సరిఅయిన అర్థము కాని, సదా పరిణామము చెందే వర్ణమును గురించి గాని, ఆశ్రమమును గురించి గాని చెప్పటం కాదని, ఈ సత్యాన్ని లోకానికి ఎలుగెత్తి చాటి చెప్పటానికే తాను భగవద్గీతను వ్యాఖ్యానించానని శ్రీవారు చెప్పారు.

జ్ఞాన యోగములోని 13వ శ్లోకము "చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః" చాతుర్వర్ణ్య వ్యవస్థ జన్మనా కాదని, గుణమునే గురించి చెప్పబడిందని లోకము గ్రహించాలని శ్రీవారి ఆశయము. దీనిలోని మోక్షార్థమే మళ్ళీ 18వ అధ్యాయంలోని 41,42,43,44 శ్లోకాలలో సవిస్తారంగా వివరించబడిందని శ్రీవారు చెపుతారు. వర్ణ ధర్మములను శ్రీకృష్ణ భగవానుడే స్వయంగా వారి వారి స్వభావాన్ని, అనగా గుణాన్ని బట్టి ఏర్పరిచాను అని చెపుతుండగా గీతకు వ్యాఖ్యానములు చేసిన ఎందరో వారి వారి బుద్ధిని, విద్యను బట్టి అనేక అర్థాలు చెప్పినా సత్యమయిన అర్థాన్ని శ్రీ స్వాములవారి అభిప్రాయానికి అనుగుణంగానే శ్రీ శంకరానంద, ఆనందగిరి, మధుసూదన సరస్వతి మొదలైన మహాత్ములు తమ వ్యాఖ్యానాలలో విశదీకరించారని సద్గురు దేవులు చెపుతారు.

సనాతనులము అని చెప్పుకునేవారు వారి వారి ఆహార విహారము గురించి, విద్యా, జీవన విధానము గురించి తమలో తాము జాగ్రత్తగా ఆలోచించుకుంటే పూర్వకాలపు ఋషుల సనాతన ధర్మాచరణకు, తమకు ఉన్న భేదాన్ని, మార్పును సరిగ్గా గ్రహించగల్గుతారని సద్గురు దేవులు అన్నారు.

ధర్మ నిర్ణయము చేసేటప్పుడు పరాశర స్మృతిలోని ధర్మ నిర్ణయాన్ని

శ్రీ మదాంధ్ర మహా భాగవతము

ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

పరిశీలించాలని గురుదేవులు చెప్పారు. [illegible] ఎవరు అర్హులు అంటే ఆత్మవిద్యానుభవము కల్గి మననశీలురయిన వారు లోకానుగ్రహార్థము యజ్ఞములు ఆచరించేవారు. వేదవిద్యా వ్రత స్నాతులు అయిన ద్విజులలో ఒక్కరయినా ఉండాలన్నారు. వీరితో ఆత్మవేత్తలు, ధర్మశీలురు ఐదుగురు గాని, నల్గురు కాని, ముగ్గురు కాని ఇద్దరు గాని, చివరికి ఒక్కరయినా గాని అప్పటి దేశకాలములకు ఏది అనుసరణీయము, ఆచరణీయము అవుతుందో అదే ధర్మము అని చెపుతుండగా, వేదకాలము నుండి ఎప్పటికీ ఒకే విధంగా వర్ణాశ్రమములు సనాతనములు అని చెప్పటం ఏమి ధర్మము? అని శ్రీవారు ప్రశ్నిస్తున్నారు. అందువలన సర్వజనులకు వారి వారి గుణకర్మల యోగ్యతను అనుసరించి సర్వకార్యములలో ప్రవేశార్హత కల్గించాలని, అదే సత్యమయిన మతమని శ్రీవారి అభిమతము.

ధర్మశాస్త్రము లన్నింటిలోకి మనుస్మృతి మొదటిది. దానినే సనాతన ధర్మము అని చెపుతారు. కాని అది కృతయుగమునకు మాత్రమే ఉపకరిస్తుందని, త్రేతాయుగానికి గౌతముడు గౌతమ స్మృతిని రచించాడు. అది ద్వాపర యుగానికి పనికిరాదు అని నిశ్చయించుకొని శంఖలిఖితులు స్మృతిని వ్రాయగా ఈ మూడు స్మృతులు అనగా మనుస్మృతి, గౌతమ స్మృతి, శంఖలిఖిత స్మృతి కూడా కలియుగానికి పనికిరావు అని నిశ్చయించి శ్రీ పరాశరుడు పరాశర స్మృతిని రచించాడు. ఇంకా అనేకమంది ఋషులు యాజ్ఞవల్క్యుడు, వసిష్ఠుడు, వ్యాసుడు, దేవలుడు మొదలైన వారు కూడా వారి పేర్లతో స్మృతులు రచించారు కదా! ధర్మమునకు పరిణామము లేకపోతే, కాలానికి అనుగుణంగా ఇన్ని స్మృతులు ఎందుకు ఋషుల చేత వ్రాయబడవల్సి వస్తుంది? దీనికి సనాతనులము అని చెప్పుకునే వారు ఏమి సమాధానము చెపుతారు? అని స్వామీజీ ప్రశ్నిస్తున్నారు.

అలాగే స్త్రీలకు, శూద్రులకు శాస్త్రములను చదవటానికి అర్హత

లేదని ఒక కాలములో కొందరు సంకుచిత హృదయము కలవారు చెపుతుండేవారు. భగవద్గీత 9వ అధ్యాయంలో 32వ శ్లోకమునకు కొందరు ప్రఖ్యాత భాష్యకారులు, స్త్రీలు, శూద్రులు, వైశ్యులు మొదలైన వారు పాపయోని సంభూతులు అని చేసిన వ్యాఖ్యానాన్ని సద్గురు దేవులు నిశితంగా, అతి తీవ్రంగా ఖండించివేశారు. ఇది చాలా పాపమని, తల్లి పాపాత్మురాలు అని భావించేవాడు పాపాత్ముడని అన్నారు. దీనికి శ్రీ శ్రీధర, శ్రీ శంకరానందగిరి మొదలైనవారు చేసిన వ్యాఖ్యానంలో "పాపయోని సంభూతులు ఎవరు కలవారో, అట్లు కాని వారయిన స్త్రీ, వైశ్య, శూద్రులని వేరుగా చేసిన వ్యాఖ్యానము నిజమయిన, సత్యమయినది అని శ్రీవారి అభిప్రాయము. అంతేకాకుండా గోపికా స్త్రీలను, శబరి, ప్రహ్లాదుడు, విభీషణుడు మొదలైన [illegible] పాపయోని సంభూతులు అయితే భగవానుడు [illegible] అని అడుగుతున్నారు.

ఎవరి కెఱుక ?

అలాగే దశమాధ్యాయంలో 34వ శ్లోకంలో స్త్రీలల్లో ధర్మగుణమయిన కీర్తి, జ్ఞానము వలన కలిగే లక్ష్మి, మధురమయిన వాక్కు, జ్ఞాపకశక్తి, ధైర్యము, సహనము, మేధాశక్తి తన విభూతియే అని చెప్పాడు కదా! ఋషుల్లో, పురుషుల్లో రాజుల్లో భగవంతుని అంశ ఒక్కటి మాత్రమే చెప్పి స్త్రీలలో భగవంతుని అంశ ఏడుపాళ్ళు అధికంగా ఉందని నిరూపించగా స్త్రీలు పాపయోని సంభూతులని వ్యాఖ్యానము చేసే సంకుచిత హృదయము కలవారిని సనాతనులు అని ఎలా అనగలము?

- ఆచార్య కె.సర్వోత్తమరావు (తిరుపతి)

ఓంకార ధ్యానము చేయటానికి స్త్రీలు, శూద్రులు అర్హులు కారు అని కూడా సనాతనులమని చెప్పుకునేవారు అంటూ ఉంటారు. దీనికి గురుదేవులు భగవద్గీతలో 8వ అధ్యాయంలో 13వ శ్లోకాన్ని ప్రమాణంగా నిరూపిస్తూ చేసిన వ్యాఖ్యానము గమనించదగినది. మహర్షి భావాలు చాలా విశాలమయినవి.

ప్రాణ ప్రయాణ సమయంలో ఓంకారాన్ని ఉచ్చరించి దేహాన్ని విడిచిన వాడు అక్షర పరబ్రహ్మాన్ని పొందుతాడని శ్రీ కృష్ణ భగవానుడు ఉపదేశించాడు తప్ప ఫలాని జాతి వారు గాని, ఫలాని కులము వారు గాని, లేదా ఫలాని ఆశ్రమములో ఉండేవారు గాని, లేదా స్త్రీలు, పురుషులు అర్హులు అని భేదము చెప్పలేదు. కాబట్టి ముక్తి కోరేవారు ఎవరయినా ఓంకారాన్ని ఉంచ్చరించవచ్చునని, ప్రణవాన్ని ఉచ్చరించటానికి నిజంగా వర్ణాశ్రమ భేదముంటే భగవానుడు ప్రత్యేకంగా చెప్పి ఉండేవాడు కదా? కాబట్టి మనకి భగవంతుని వాక్యాలు ప్రమాణము అని తేల్చి చెప్పారు గురుదేవులు.

అంతేకాక పూర్వము భగవద్గీత మొదలైన శాస్త్రములు కూడా అందరు చదవకూడదు అని చెపుతుండేవారు. ఇలా చెప్పేవారందరూ శాస్త్రములను చదివేవారే కాని దానిలో చెప్పిన దానిని సరిగ్గా అర్థము చేసుకొని ఆచరించేవారు కారు అని గురుదేవులు స్పష్టంగా చెపుతున్నారు. ఇలా ఆచరణ లేనివారి మూలంగానే భారతదేశం హీనస్థితికి వచ్చిందని మహర్షి అభిప్రాయము. మూఢ, అంధ విశ్వాసముల వలన సమాజము ఏ విధంగా అభివృద్ధిలోనికి వస్తుంది? 9వ అధ్యాయంలో భగవానుడు స్వయంగా రహస్యమయిన బ్రహ్మవిద్యను పొందటానికి బ్రాహ్మణాది సర్వ వర్ణముల వారికి, స్త్రీలకు మాత్రము అధికారము కలదు అని చెప్పక పాప జన్మము గలవారు ఎవరెవరు కలరో వారికి కూడా అర్హత కలదు అని గీతాశాస్త్ర అధికారాన్ని చక్కగా నిరూపించారు అని గురుదేవులు గుర్తు చేస్తున్నారు.

కర్మయోగ రహస్యాన్ని గురుదేవులు తమ వ్యాఖ్యానంలో చక్కగా నిరూపించారు. జ్ఞాని అయిన తర్వాతే కర్మయోగము చేయటానికి నిజమయిన అర్హత కల్గుతుంది అని చెప్పారు. ఇదే గీతాతత్త్వము యొక్క రహస్యము అంటారు వారు. జ్ఞాని కూడా ద్వంద్వములు ఉన్నంతవరకూ

శాస్త్రము విధించిన అనుష్ఠాన కర్మలు ఆచరించాలని, దృశ్యవృత్తులు నశించి నిరంతరము దైవాకార స్థితిలో ఉండే జ్ఞానికి మాత్రమే కర్మ చేయాల్సిన అవసరం లేదని గీతాచార్యులు చెప్పిన దానిని ఆధారంగా చేసుకొని కొందరు జ్ఞాని అయిన వారికి ఏ కర్మము లేదు అని చెప్పుకుంటూ, ఇంద్రియ సౌఖ్యములకే లోబడిపోయి స్వధర్మానుష్ఠానము విడిచిపెట్టి సోమరితనముతో జీవితము గడుపుతున్నారని, అలాంటి దోషము గల వారి వల్ల నివృత్తి మార్గములోని (సాధువులు) అనేక మంది పతితులు అవుతున్నారని, దీనికి సరయిన మార్గం లేదా విధానం ఏర్పడినప్పుడే మన భారతదేశం ఊర్ధ్వస్థితికి రాగలుగుతుందని గురుదేవులు నిర్మొహమాటంగా, నిష్కపటంగా, నిక్కచ్చితంగా చెపుతున్నారు.

సద్గురు స్వాములవారు గోగర్భంలో తపస్సు చేస్తున్న కాలములో కొందరు భక్తులు వారిని మీరు ఏమి కోరి తపస్సు చేస్తున్నారు? మోక్షము కోసమా? అని అడిగారు. దానికి స్వామీజీ సమాధానం చెపుతూ, తాను మోక్షము కోసం తపస్సు చేయటం లేదని చెప్పారు. దీనిలోని పరమ రహస్యము మనకు గీతాచార్యులు బోధించిన అతి ముఖ్యమైన పద్దెనిమిదవ అధ్యాయము అయిన మోక్షసన్యాస యోగములో గురుదేవులు వివరించారు. మోక్షమును కూడా సన్న్యసించాలి అని గీతాచార్యుని ఆశయము అవటం చేతనే దీనికి మోక్ష సన్న్యాస యోగమని పేరు వచ్చింది. 17వ అధ్యాయంలో భగవానుడు చెప్పిన సమస్త విషయాలు మోక్షము కోసమే కదా? ఆ విధంగా భగవానుడు ఉపదేశించిన ప్రకారము అనుష్ఠించిన వారికి స్వయంగా మోక్షము సిద్ధిస్తుంది. కనుక ఇంక మోక్షము కావాలి అనే కోరిక వానికి ఉండదు. ముక్తుడయిన వానికి మోక్షముతో పని ఉండదు కదా ! శుద్ధ జీవునికి సంకల్పములు, బంధనములు, మాయా మోహములు

ఉండవు. కేవలము తాను స్వయం ప్రకాశుడనని బోధ కల్గుతుంది. వారికి తిరిగి జన్మ ఉండదు. జన్మ కల్గినా బంధనముండదు. కేవలము లోకోద్ధరణము కొరకే వారు అవతరిస్తారు. సద్గురు మహర్షి మలయాళస్వాములవారిది అట్టి అపూర్వస్థితి. అందుచేతనే వారు మోక్షము కోసం తపస్సు చేయటం లేదని, లోకోద్ధరణకు ఉపకరించే జన్మ కావాలని కోరుకుంటున్నానని తెలిపారు.

సద్గురు దేవుని జీవితము, ఆచరణ, అఖండ బోధ, ధర్మ ప్రచారము అన్నీ గీతాచార్యుని ప్రబోధమును అనుసరించినవే కనుకనే స్వామి శివానందులు "భగవద్గీతకు భాష్యమే మలయాళస్వాములవారి జీవితము" అన్నారు. భగవద్గీతను ఆధారంగా చేసుకునే శ్రీవారి ధర్మ ప్రచారము జరిగింది. ఆంధ్ర దేశమంతా శ్రీవారి గీతా ప్రచారము వలన ఆధ్యాత్మికంగా వెనుకబడిన స్త్రీలు, ద్విజేతరులు పురోగతిని పొందారు. మహిళలు విద్యావంతులై వేదికలు ఎక్కి వేదాంత ప్రబోధములు చేయసాగారు. ద్విజేతరులు సంస్కృత విద్యాకేంద్రాలలో ఆచార్య పీఠాన్ని అధిష్ఠించారు. శుష్కవేదాంతుల ప్రలాపములన్నీ అరికట్టబడ్డాయి. లక్షల కొలది స్త్రీ పురుషులకు గీత పరిచయముంది. అందరూ కలిసి సామూహికంగా గీతాపారాయణం చేయసాగారు..ఆంధ్రదేశములో మూలమూలలా గీతా మందిరాలు, ఆశ్రమాలు నెలకొల్పబడ్డాయి.

సత్యసంధులు, తపస్సంపన్నులు, సదాచార పరాయణులు, లోకోద్ధారణ కంకణబద్ధులు, కరుణామూర్తులు అయిన మహర్షులు ఏ కాలములో అయినా, ఏ దేశములో అయినా తమ పవిత్రమయిన సంకల్పాలను, లక్ష్యాన్ని సాధించగలరు అనే సనాతన సత్యము సద్గురు దేవుని దివ్య జీవితము చేత లోకములో ప్రకటితమయింది.

ద్వేషము చేత ద్వేషము నశించదు. ప్రేమ చేతనే ద్వేషము నశిస్తుంది. గాన అందరిని ప్రేమించుము.

జాతస్య హి ధ్రువో మృత్యుః

– ఆచార్య కె. సర్వోత్తమరావు (తిరుపతి)

ఈ గీతా వాక్యం సాంఖ్యయోగనామకమయిన రెండవ అధ్యాయంలో ఇరవై ఏడవ శ్లోక ప్రారంభ భాగం. పుట్టినవానికి చావు తప్పదు అని సారాంశం. ఈ వాక్యం జనసామాన్యంలో బహుళ ప్రసిద్ధి.

శారీరక దశలలో బాల్యం, యౌవనం, వార్ధక్యం, మరణం, ఆపై దేహాంతర ప్రాప్తి సహజం. దేహం శాశ్వతం కాదు. ధరించిన చిరిగిన దుస్తులను వదలిపెట్టడం లాంటిదే. శిథిల దేహత్యాగం మరణం. ఈ మరణం తప్పదు. ఈ భావాలకు సంబంధించిన కథ లెన్నో పురాణాల్లో కనిపిస్తాయి.

శ్రీమద్రామాయణంలో అజుడు ఇందుమతి మరణానికి శోకించాడు. భరతుడు తన కారణంగానే దశరథుడు మరణం పాలయ్యాడని వగచినాడు. అలాగే సుగ్రీవ, విభీషణాదులు తమ అన్న అపమృత్యువుకు తామే కారకులుగా భావించి యేడ్చారు. భారతంలో పాండురాజు మరణం మాద్రిని కలచివేసింది. విచిత్రవీర్యాదుల మరణం సత్యవతిని పరితపింపచేసింది. అలా కురుక్షేత్ర సంగ్రామంలో సకల బాంధవానీక మరణానికి తాను కారకుణ్ణి అవుతున్నాను కదా అని అర్జునుడు పరితపించాడు.

మరణం ఎవరినయినా కుంగదీస్తుంది. వీటిలో సహజ మరణాదులొక రకమయితే, అకాల మరణాలు చాల బాధపెడతాయి. మహాభారతంలో అకాల మరణం పాలయిన బిడ్డను శ్మశానంలో అంత్యక్రియలు చేయడానికి సంసిద్ధమయినపుడు నక్క, గ్రద్దలు ఆ శిశు తల్లితండ్రులను ఆశ్వాసించాయి. ఆ ఆశ్వాసంలో స్వార్థం లేకపోలేదు.

బౌద్ధంలో మరణానికి సంబంధించిన కథలెన్నో వున్నాయి. ఒక ముదుసలి తన బిడ్డ మరణించగా కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. చివరకు కొండమీది బుద్ధుడు బ్రతికిస్తాడని చెబితే బిడ్డతో కదిలింది. గౌతముడు సాంతం శాంతంగా విన్నాడు. దుఃఖమంటే తెలియని యింట్లో ఆవాలు తెమ్మన్నాడు. ముదుసలి పల్లెల్లో ప్రతి ఇల్లు తిరిగింది. దుఃఖం లేని ఇల్లు కనిపించలేదు. చివరకు 'మరణం' సహజమని తెలుసుకోగలిగింది.

భారతంలో ధర్మరాజు మహాప్రస్థానంలో తమ్ముళ్ళు, ద్రౌపది అందరూ యోగం సడలింపుతో పడిపోతుంటే బాధపడలేదు. కాని స్వర్గంలో దుర్యోధనాదుల్ని చూచి తన సోదరులను తలచుకొని బావురుమన్నాడు.

అవతారాలకు నిర్యాణం లేకపోలేదు. శ్రీరామచంద్రాదులు సరయూలో మునిగి అవతారం చాలించారు. కృష్ణుడు బోయవాని బాణం అరికాలులో నాటుకోగా ఆ నెపంతో తనువు చాలించాడు. మహాపురుషులు యోగంతో దేహత్యాగం చేశారు.

సమవర్తికి అందరు సమానమే. ఆ దుఃఖం అలవిలేనిది కావచ్చు. ఆ మరణానికి వ్యాధి కారణం కావచ్చు. చోరహతం కావచ్చు. ప్రకృతి వైపరీత్యాలు కావచ్చు. దండయాత్రలు కావచ్చు. ఆకలి మరణాలు కావచ్చు. కాని వాటిని జలప్రవాహం చూసే ప్రేక్షకునిలా భావించడం అవసరం. అపుడే తరువాత జీవితాన్ని లక్ష్యంతో గడుపగలడు.

అంతరిక్షంలో గాని, సముద్రంలోగాని, పర్వత గుహల్లోగాని ఎక్కడ దాక్కున్నా మరణం తప్పదు. పండిన పండ్లు చెట్ల నుండి రాలడం సహజమే. అలాగే ఆకులు కూడా. ఇదొక సహజ పరిణామం. కుమ్మరి చేసిన కుండలు ఏనాడయినా పగిలిపోక తప్పదు. పశువుల్ని కసాయివాడు లాక్కెళుతున్నట్టు మృత్యువు ప్రతి జీవినీ లాక్కొని వెళుతుంది. ధనధాన్యాదులు, వెండి బంగారాలు, ఇతర సంపదలు, అనుచరులు, సేవకులు, బంధువులు అనే బంధాలను వదలి జీవి మృత్యువు వెంబడి వెళ్ళక తప్పదు. అతని వెంట వచ్చేవి పుణ్యపాపాలే. ఆ కర్మల కనుగుణంగా మరల జన్మాదులు. ఆ కారణం వల్ల మరణభీతి తగదు.

జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మమృతస్య చ
తస్మాదపరిహార్యే ఽ ర్థే న త్వం శోచితు మర్హసి.

వార్తలు

(01). జూన్ 12వ తేది మంగళవారం మాసశివరాత్రి సందర్భంగా ప్రదోష కాలంలో ఆశ్రమ శివాలయంలో నర్మదేశ్వర మహాదేవునకు రుద్రాభిషేకం, బిల్వార్చన జరిగినది.

(02). జూన్ 23వ తేది నిర్జల ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజ జరిగినది..

(03). మే 25వ తేది ఏకాదశి సందర్భంగా స్థానిక చాముండేశ్వరి భజన సమాజం వారు శ్రీ బత్తెయ్య గారి ఆధ్వర్యంలో ఆశ్రమ శివాలయంలో నామసంకీర్తన చేశారు. జూన్ 29వ తేది స్థానిక శ్రీ పాండు గారి ఆధ్వర్యంలో సత్యసాయి సేవా సమితి వారు ఆశ్రమ శివాలయంలో అఖండనామ సంకీర్తన చేశారు. ఆనాడు పౌర్ణమి గాన శ్రీసద్గురు పాదుకాపూజ జరిగి అన్న సంతర్పణ జరిగినది.

(04).జూన్ 27వ తేది సాయంకాలం త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు సమావేశం శ్రీశుకబ్రహ్మాశ్రమంలో జరిగినది. ఆడిట్ రిపోర్టులను పరిశీలించి ఆమోదించబడెను.

(05). జూన్ 3వ తేది ఆదివారం ఏర్పేడు మండలం నాగంపల్లిలోని ఎస్.ఓ.ఎస్ చిల్డ్రన్ విలేజి ఆవరణలో ఆశ్రమ శ్రీ స్వామి విద్యాప్రకాశానంద స్మారక వైద్య శిబిరం నడచినది. అందు డా॥ కొండారెడ్డి గారు ఎం.డి, డా॥ వెంకట్రామన్ గారు, ఎం.డి. (చిన్న పిల్లల వైద్య నిపుణులు), డా॥ విద్యావతి (గైనికాలజిస్టు), డా॥రవిబాబు ఎం.ఎస్,, డా॥ తేజోమయి (స్కిన్ స్పెషలిస్టు), డా॥ ఎం.లక్ష్మీనారాయణ, బి.డి.ఎస్, శ్రీ టి.జయచంద్రప్ప (కన్ను) ఆశ్రమ భక్త కన్నప్ప కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. రెండు వందలా ఇరవై మందికి మెడికల్ టెస్టులు జరిపి మందులివ్వబడినవి. మందులు ఆశ్రమ సద్గురు సర్వ సేవా ట్రస్టు చేత ఉచితంగా ఇవ్వబడినది.

(06). జూన్ 8వ తేది నుండి 3 రోజులు కర్నూలుజిల్లా, ఆస్పిరి మండలం జొహరాపురంలోని అద్వైతాశ్రమ పుణ్యారాధనోత్సవాలలో పూజ్యశ్రీ విద్యాస్వరూపా నందగిరిస్వాములవారు పాల్గొని ప్రవచన చేశారు. ఈ కార్యక్రమంలో పూజ్యశ్రీ దండినిర్మలానందస్వాములవారు (తెనాలి) పూజ్యశ్రీ డా॥ కరిబసవ రాజేంద్ర స్వాములవారు (ఉరవకొండ) వగైరా మహాత్ములు పాల్గొని ప్రవచనాలు చేశారు.

(7). ఆశ్రమ కంటిఆసుపత్రిలో మే నెలలో ఓ.పి. విభాగంలో **1200 మందికి** కంటి పరీక్షలు, చికిత్సలు చేశారు. **121** మందికి కంటి పొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చారు. **12 మందికి** యాగ్ లేజర్ చికిత్స చేశారు.